PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 358 | విజయవాడ, మంగళవారం 30 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 30 July 2024 | Rs

కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో ఏటుగట్టు పైనే నివాసం ఉంటున్న వరద బాధితులు

పనుల్లేక ఉసూరుమంటూ...

- వారం రోజులుగా ముంపులోనే లంకలు
- స్తంభించిన జనజీవనం

2

మరో కాంస్యంపై భారత్ గురి

- 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీం విభాగంలో నేడు కొరియాతో ఢీ

6

2029 నాటికి పేదలందరికీ ఇళ్లు

- పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు
- గృహనిర్మాణ శాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అర్హులైన పేదలందరికీ 2029 నాటికి సొంత ఇళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణశాఖపై ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి సోమవారం ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. దీనికి తగ్గట్లుగా చర్యలు తీసుకోవాలని అధికారుకు దిశా నిర్దేశం చేశారు. గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల కోసం భూ సేకరణ జరిపి లే అవుట్లు వేయని స్థలాల్లోనూ పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని అన్నారు. రానున్న 100రోజుల్లో 1.25లక్షల గృహాలు, ఏడాదిలో 8.25లక్షల గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలిచ్చి , మౌలిక సదుపాయాలను కల్పించ లేదని, అటువంటి లే అవుట్లలో కూడా మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఎం ఆదేశించారు. 2014-19 , 2019-24 మధ్య పోల్చితే గృహనిర్మాణ పథకంలో గత ప్రభుత్వ హయాంలో 9నుంచి 10వేల కోట్ల వరకు పేదలకు అన్యాయం జరిగిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఎలాంటి అదనపు లబ్ధిలేకుండా చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.4లక్షల యూనిట్ కాస్ట్‌తో వచ్చే ఏడాది మార్చి నుంచి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పార్థసారధి హైదరాబాద్ సంజీవరెడ్డినగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో కేంద్ర పథకాల ఆసరాతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలకు, జర్నలిస్టులకు సరసమైన ధరలకే ఇళ్లను నిర్మించాలని సిఎం ఆదేశించారని చెప్పారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ కింద ఇళ్ల నిర్మాణాన్ని గృహనిర్మాణశాఖకు అప్పగించే అంశంపై సిఎం సానుకూలంగా స్పందించారన్నారు. గృహ నిర్మాణశాఖ, పిఎంఎవై పథకం ఆసరాతో చేపట్టిన గృహాల్లో ఇంకా 8లక్షల గృహాలు ప్రగతిలో ఉన్నాయని, వాటినికూడా తమ ప్రభుత్వం పూర్తి చేయనున్నట్లు మంత్రి పార్ధసారధి తెలిపారు. కోర్టు కేసుల్లో ఉండి ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం లేనిచోట సంబంధిత లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చే అవకాశం కొత్త పథకంలో ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

అన్యాక్రాంత భూముల లెక్కలు తేల్చాల్సిందే : సిఎం 2

ప్రజలపై పద్మవ్యూహం

- అదానీ, అంబానీల కోసమే కేంద్రం
- ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిలకు బడ్జెట్ హల్వా ఏదీ?
- కేంద్ర బడ్జెట్‌పై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ విమర్శ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన మధ్య తరగతి ప్రజలకు మోడీ ప్రభుత్వం వెన్నుపోటు పొడవడమే కాదు, వారి గుండెపైనా పోటు పొడిచిందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బడ్జెట్ హల్వా దేశంలోని 2,-3 శాతం మందికే పంచిపెట్టి, ఎస్సీ, ఎస్టీ, బిసిలను దగా చేశారని ఆయన విమర్శించారు. బిజెపి పద్మవ్యూహం (కమలం వ్యూహం)లో చిక్కుకోవడానికి భారత ప్రజలు అభిమన్యులు కాదని, అర్జునులని ఆయన అన్నారు. లోక్‌సభలో బడ్జెట్‌పై సోమవారం జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, అంబానీ, అదానీల కోసమే బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆనవాయితీ ప్రకారం బడ్జెట్‌కు ముందు పంచిపెట్టిన హల్వా గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, ఈ హల్వా అందుకున్నవారిలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసీలకు చెందిన అధికారులు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. కావాలంటే వారి వివరాలతో సహా ఇస్తాను అని రాహుల్ అనడంతో అధికార పక్ష సభ్యులు రయ్యన లేచారు. ప్రతిపక్ష నాయకుడు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, ఆయనను నియంత్రించాలని స్పీకర్‌ను కోరారు. అంబానీ, అదానీ పేర్లను ప్రస్తావించిన ప్రతి సారి బిజెపి సభ్యులు లేచి అభ్యంతరం తెలిపారు. సభలో లేని వారి పేర్లను ఉటంకించడం సరికాదని స్పీకర్ అన్నారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ, అంబానీ, అదానీ పేర్లకు బదులు ఎ1, ఎ2 అని పేర్కొంటే అభ్యంతరమా అని అడిగారు. బడ్జెట్‌లో పద్మ వ్యూహం కొద్ది మంది కుబేరుల కోసం అత్యధిక మంది ప్రజానీకం ప్రయోజనాన్ని పణంగా పెట్టేదిగా ఉందన్నారు. ఈ ఫ్రేమ్‌వర్కుని తాము బద్దలు చేసి తీరుతామని అన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ చక్ర వ్యూహంలో మూడు రకాల బలగాలున్నాయని, వాటిలో ఒకటి ఆర్థిక బలగమని, ఇది అదానీ, అంబానీ అదుపాజ్ఞల్లో పనిచేస్తుందని, రెండో బలగం కేంద్ర దర్యాప్తు సంస్థలు. అవే ఇడి, సిబిఐ, ఐటి వీటిని రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు ఉపయోగిస్తుంది. మూడో బలగం రాజకీయ పార్టీలు. దాడులు, అరెస్టులతో భయోత్పాతం సృష్టిస్తుంటుంది అని రాహుల్‌గాంధీ వివరించారు.

నాడు పద్మవ్యూహంలో ఆరుగురు అభిమన్యుడిని హత్య చేశారని, ఇప్పుడు కూడా ఆ ఆరుగురు పద్యవ్యూహంలో భాగస్వాములయ్యారని చెప్పారు. వారు ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, జాతీయ భద్రతా సలహాదారు మిగతా 5లో

బడుగు, బలహీన వర్గాల అధికారులపై వివక్ష చూపారంటూ బడ్జెట్ హల్వా వేడుక ఫొటో చూపుతున్న రాహుల్‌గాంధీ

ప్రజాసమస్యల ఊసేలేదు

బడ్జెట్‌పై చర్చలో సిపిఎం లోక్‌సభాపక్ష నేత కె రాధాకృష్ణన్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న ఉమ్మడి సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదన చేయలేదని సిపిఎం లోక్‌సభా పక్ష నేత కె రాధాకృష్ణన్ విమర్శించారు. లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై సోమవారం జరిగిన చర్చలో సిపిఎం తరపున ఆయన మాట్లాడారు. 2014 నుంచి బిజెపి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించి ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధిచెప్పారని అన్నారు.. ప్రధాని మోడీ 400 సీట్లకు పైగా ఇవ్వాలని కోరినా, ప్రజలు బిజెపిని 240 సీట్లకే పరిమితం చేశారని అన్నారు. మెజారిటీ కోల్పోయినా బిజెపి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు పాకులాడుతోందని ఆయన విమర్శించారు.కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వగా, మెజారిటీ రాష్ట్రాలను పట్టించుకోలేదని అన్నారు. బడ్జెట్‌లో కేరళ రాష్ట్రం కనిపించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం రూ.24 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని నివేదిక సమర్పించినా పైసా కూడా మంజూరు చేయలేదని అన్నారు. అనేక రంగాల్లో విజయాలు సాధిస్తున్న కేరళను కేంద్రప్రభుత్వం శిక్షిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారని, వారి జీవితాలను మెరుగుపరిచేందుకు ఎలాంటి నిర్మాణాత్మక ప్రణాళికలను బడ్జెట్‌లో పేర్కొనలేదని విమర్శించారు. పేదరికం, అసమానతలు, వివక్షలకు సంబంధించిన సూచీలలో భారత దేశం స్థానం దయనీయంగా ఉందని ఎత్తి చూపారు.

15 రోజుల్లో పరిష్కారం

- శివ్వాం దళితుల సమస్యపై జెసి హామీ
- 'చలో కలెక్టరేట్'తో దిగొచ్చిన అధికారులు
- అడ్డుకోవడానికి అరెస్టులు, గృహ నిర్బంధాలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామ దళితుల పోరాటానికి అధికారులు దిగొచ్చారు. భూ సమస్యను 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాట ఈ సారైనా నిలుపుకోకపోతే పెద్ద ఎత్తున మళ్లీ ఉద్యమిస్తామని దళితులు, నాయకులు తేల్చి చెప్పారు. శివ్వాం గ్రామ దళితులకు న్యాయం చేయాలని, వారి భూములను వారికి అప్పగించాలని, దళితులపై అమానుషంగా దాడి చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గత 15 రోజులుగా పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. అయినా, అధికారుల్లో చలనం లేకపోవడంతో సోమవారం 'చలో కలెక్టరేట్' తలపెట్టారు. దీనికి వామపక్ష పార్టీలు, వివిధ ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. ఈ నేపథ్యంలో పలువురి నాయకులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. నిర్బంధాన్ని ఎదుర్కొని పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దకు బాధితులు, నాయకులు చేరుకున్నారు. ర్యాలీగా వెళ్తున్న పోలీసులు అడ్డుకొని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆలిండియా కౌన్సిల్ సభ్యులు గంగారాపు సింహాచలం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, గిరిజన సంఘం, సిఐటియు, ఐద్వా, ఎస్‌ఎఫ్ఐ, సిపిఐ, సిపిఐఎంఎల్, ప్రజా సంఘాల నాయకులను, దళితులను బలవంతంగా అరెస్టు చేసి వ్యానులో కొమరాడ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో మిగిలిన వారు కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, దళితుల భూ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో, మిగతా 5లో

నాయకులు, దళితులతో చర్చిస్తున్న ఆర్‌డిఒ కె.హేమలత

రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు

హెచ్‌ఆర్ఎ పెంపు

- ఉద్యోగ సంఘాల హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర సచివాలయం, హెచ్ఒడి కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. సచివాలయ ఉద్యోగులకు సంబంధించి హెచ్‌ఆర్ఎను పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు హెచ్‌ఆర్ఎ 16 శాతం వుండగా, రాష్ట్ర ప్రభుత్వం 24 శాతానికి పెంచింది. ఈ పెంపుదల రూ.25 వేలకు మించకుండా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 12వ పిఆర్‌సి అమలులోకి రానందున 2025 జూన్ వరకు ఈ పెంపుదల వుంటుందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఆర్ఎను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా సచివాయల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

విజయోత్సవంలో మదురో

వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో మదురో హ్యాట్రిక్ విజయం

- 51.2 శాతం ఓట్లతో తిరుగులేని ఆధిక్యత
- అభినందించిన లాటిన్ అమెరికా దేశాల నేతలు
- ఎన్నికల ఫలితాలపై ప్రధాన ప్రతిపక్షం యాగీ

కారకస్: ఆదివారం జరిగిన వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో వామపక్షవాది నికోలస్ మదురో ముచ్చటగా మూడోసారి తిరుగులేని విజయం సాధించారు. జాతీయ ఎన్నికల సంఘం (సిఎన్ఇ) అధ్యక్షుడు ఎల్విస్ అమోరసా సోమవారం ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తూ, మదురో 51.2 శాతం ఓట్లతో విజయం సాధించారని అధికారికంగా ప్రకటించారు. పచ్చి మితవాది, ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థి అయిన ఎడ్మండ్ గొంజాలెజ్ 44 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. మొత్తం 2.1 కోట్ల మంది అర్హులైన ఓటర్లకు గాను 1.1 కోట్ల మంది అంటే 59 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చెల్లుబాటు అయిన ఓట్లలో లెఫ్ట్ పార్టీలతో కూడిన గ్రేట్ పేట్రియాటిక్ పోల్ మిగతా 5లో

శ్రీశైలం నుంచి విడులవుతున్న నీరు

'శ్రీశైలం' నీటి విడుదల

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ జూరాల నుండి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. జలాశయం ఆనకట్ట నుండి జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కబీర్ బాష 6, 7, 8 గేట్లను పది అడుగుల మేరఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు 76,056 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేశారు. ఎగువ జూరాల నుండి 3,03,984 లక్షల క్యూసెక్కులు, తుంగభద్ర నుంచి 1,48,599 లక్షల క్యూసెక్కులు కలిపి 4,52,583 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 879.20 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 184.274 టిఎంసిలు ఉన్నాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 15,792 వేల క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1,600 క్యూసెక్కులు విడుదల చేశారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 26,495 వేల క్యూసెక్కుల నీటితో 15.44 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 35,315 వేల క్యూసెక్కుల నీటితో 18.69 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అనంతరం 61,810 క్యూసెక్కులు, మూడు గేట్ల ద్వారా మరో 76,056 క్యూసెక్కులతో కలిపి మొత్తం 1,37,866 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

లోపలి పేజీల్లో..

వేతనాల కోసం రోడ్డెక్కిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

- ధర్నాకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు మద్దతు
- దశల వారీగా చెల్లిస్తాం : రైతుసాధికారత సంస్థ సిఇఒ

విహారం... విషాదాంతం

- తెలుగుగంగ జలాశయంలో పడి ముగ్గురు యువకులు మృతి

తగ్గుముఖం పట్టిన గోదావరి

- భద్రాచలం వద్ద 43 అడుగులు
- ధవళేశ్వరం వద్ద నిలకడగా వరద ప్రవాహం

మదనపల్లె ఘటనలో అధికారుల సస్పెన్షన్

- పూర్వ, ప్రస్తుత ఆర్‌డిఒలపై వేటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల దహనం కేసులో అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. పూర్వ ఆర్‌డిఒ మురళి, ప్రస్తుత ఆర్‌డిఒ హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమాలు గుర్తించాం : ఆర్‌పి సిసోదియా

మదనపల్లె ఘటన కుట్రకోణంలోనే జరిగిందని.. సబ్ కలెక్టరేట్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం లేదని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోదియా చెప్పారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. "దస్త్రాల దహనం ఘటనపై వాచ్‌మెన్‌ను విచారించాం. ఘటన జరిగిన 15 నిమిషాల్లోనే అగ్నిమాపక సిబ్బంది వచ్చారు. అప్పటికే సబ్ కలెక్టరేట్‌లో కిటికీలు, అద్దాలు పగిలిపోయాయి. రసాయనం వాడకుండా భారీగా మంటలు వచ్చే అవకాశం లేదు. కార్యాలయంలోకి మోటార్ ఆయిల్ తెచ్చి ఉంటారు. కార్యాలయంలో కొన్ని తప్పుడు పత్రాలు ఉన్నట్లు తెలిసింది. తహసీల్దార్ నివేదికలు, సంతకం ఫోర్జరీ చేసినట్లు తేలింది. చుక్కల భూముల వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. చుక్కల భూముల్లో 14 వేల ఎకరాలు ఒకేసారి ఫ్రీహోల్డ్ అయ్యాయి. ఈ భూములన్నీ ప్రైవేటు వ్యక్తులకే కట్టబెట్టారు" అని తెలిపారు.

సబ్ కలెక్టరేట్‌కు క్యూకట్టిన భూ బాధితులు

సెటిల్‌మెంట్ భూములు లాక్కున్నారని, డికెటి భూములను ఆక్రమించుకున్నారని, తమ భూముల్లో ప్రభుత్వం రోడ్లు, కాలువలు నిర్మించి పరిహారం ఇవ్వలేదని, ఇంటి స్థలాలను కబ్జా చేశారని భూ బాధితులు సబ్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. అన్యాయంగా భూములు కోల్పోయిన బాధితులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సోమవారం పోటెత్తారు. సుమారు 200 మంది భూ బాధితులు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు అర్జీలు ఇచ్చారు. గురు, శుక్ర, శనివారాలలో సుమారు 500కు పైగా బాధితులు అర్జీలు సమర్పించారు. అర్జీల పరిశీలన అనంతరం బాధితులకు న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

అండగా ఉంటాం : నారాయణ

రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్య కాండ విధానాన్ని భూస్థాపితం చేయాలని, ఇందుకోసం ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సిపిఐ నాయకులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయ సందర్శనకు వచ్చిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో బయటి నుంచి కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల కష్టాలు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా భూ భకాసురుల ఆగడాలు మాత్రం ఆగడం లేదని చెప్పారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరిగాయి కాబట్టే ప్రభుత్వం మారిన వెంటనే భూ రికార్డులను భద్రపరిచే గదిని ప్రణాళికా ప్రకారం కాల్చివేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.

మదనపల్లె మాజీ ఎమ్మెల్యేపై కేసు 2

వరి సాగుపై తొలగని సందిగ్ధం

- స్పష్టమైన ప్రకటన చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రధాన జలాశయాలకు నీటి ప్రవాహం పెరగడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం దాదాపుగా నిండడంతో నాగార్జున సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం జలాశయం డ్యామ్ గేట్లు ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. గత నాలుగు రోజులుగా నాగార్జున సాగర్ జలాశయానికి వస్తున్న నీటి ప్రవాహం సోమవారం గణనీయంగా పెరిగింది. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 512.40 అడుగుల మేరకు నీటి నిల్వ ఉంది. పూర్తి సామర్థ్యం 312.50 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 135.78 టిఎంసిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సాగర్‌కు 55,605 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్టు జలవనరుల శాఖ అధికారులు చెప్పారు. ఎగువ నుంచి శ్రీశైలానికి 4.27 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో రెండు రోజుల్లో ఈ జలాశయం నిండుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో, సాగర్ జలాశయానికి కూడా వారంలో పూర్తి స్థాయి ప్రవాహం వస్తే ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తొలగినట్టేనని భావిస్తున్నారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాకు పట్టిసీమ నుంచి గోదావరి జలాలు వస్తుండడంతో వరి సాగుకు ఇబ్బంది ఉండదు. అయితే, సాగర్ ఆయకట్టులో వరి సాగుకు ఇంతవరకు స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వం ఈ అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో 11.26 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల పరిధిలో మెట్ట ప్రాంతంలో సాగర్ జలాలతోనే వరి సాగు జరుగుతోంది. గతేడాది సరైన వర్షాలు లేక, సాగర్ నుంచి నీరు రాక వరి సాగు జరగలేదు. కేవలం బోర్ల కింద నామమాత్రంగా సాగు చేశారు. ప్రధానంగా పల్నాడు, ప్రకాశంలో ఖరీఫ్ పంటల సాగు ఇప్పటి వరకు 20 శాతం విస్తీర్ణంలో కూడా జరగలేదు. కుడికాలువ పరిధిలో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని అంచనా. పల్నాడు జిల్లాలో 1.06 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇంతవరకూ సాగర్ కాల్వలకు నీరు విడుదల కాకపోవడంతో సాగు ప్రారంభం కాలేదు. ప్రకాశం జిల్లాల్లో 36 వేల ఎకరాలకుగాను 500 ఎకరాల్లోనే ప్రస్తుతం వరి వేశారు. ఎన్‌టిఆర్ జిల్లాలో లక్షా 25 వేల ఎకరాలకుగాను పులిచింతల దిగువన ఉన్న ప్రాంతాల్లో 24 వేల ఎకరాల్లోనే వరి సాగులో ఉంది. బాపట్ల జిల్లా అద్దంకి, పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కూడా మరో లక్ష ఎకరాల్లో వరి సాగుకు సాగర్ నుంచి నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. గుంటూరు జిల్లా పరిధిలోని తాడికొండ, పత్తిపాడు నియోజకవర్గాల్లో 20 వేల ఎకరాల్లో సాగర్ పరిధిలో వరి సాగు చేయాల్సి ఉంది. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వరి సాగుకు గతేడాది కూడా అనుమతి ఇవ్వలేదు. సాగర్ ఆయకట్టు పరిధిలో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. ఈ పంటకు మూడు తడుల నీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా జిల్లాల్లో జిల్లా నీటిపారుదల అభివృద్ధి మండలి సమావేశాలు ఇంకా జరగలేదు.

ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

సాగర్ ఆయకట్టు పరిధిలో వరి సాగుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. ప్రస్తుతం వర్షాలు కొంతమేరకు ఆశాజనకంగా ఉన్నాయి. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎగువన ఉన్న జలాశయాలు నిండడం వల్ల సాగర్‌కు కూడా నీటి ప్రవాహం ప్రారంభమైంది. ఈ దృష్ట్యా ప్రభుత్వం వరి సాగు అనుమతికి రైతులకు భరోసా ఇవ్వాలి. ఇతర పంటలకు కూడా నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలి. సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు ప్రభుత్వం తగిన భరోసా కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలి.

- వై.రాధాకృష్ణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

తగ్గుముఖం పట్టిన గోదావరి

- భద్రాచలం వద్ద 43 అడుగులు
- ధవళేశ్వరం వద్ద నిలకడగా వరద ప్రవాహం

ముంపులోనే ఉన్న విఆర్.పురం మండలం ధర్మతాళ్లగూడెం గ్రామం

ప్రజాశక్తి- యంత్రాంగం

నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. 24 గంటల క్రితం భద్రాచలం వద్ద 47.20 అడుగులుగా నమోదైన నీటిమట్టం సోమవారానికి 43 అడుగులకు చేరుకుంది. అర్ధరాత్రికి సాధారణ స్థాయికి నీటి మట్టం చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి తటస్థంగా ఉంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ వద్ద 14.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాటన్ బ్యారేజీకి చెందిన 175 గేట్ల ద్వారా 14.42 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.560 మీటర్లు, స్పిల్‌వే దిగువన 25.420 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

వరద బారిన 400 గ్రామాలు

కాటన్ బ్యారేజీ వద్ద వరద స్థిరంగా కొనసాగడంతో తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల లంక గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 400లకు పైగా గ్రామాలు వరద బారిన పడినట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. లంకగ్రామాల ప్రజల రాకపోకలు, సహాయ చర్యల నిమిత్తం 73 పడవలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. రాజమహేంద్రవరం బ్రిడ్జిలంక, మధ్యలంకల్లో 457 మంది నిర్వాసితులకు రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస శిబిరాలు కొనసాగతున్నాయి. మామిడికుదురు, పి.గన్నవరం, అయినవిల్లిలో కాజ్‌వేలు ఇంకా నీటిలోనే ఉన్నాయి.

ముంపులోనే విలీన మండలాలు

అల్లూరి జిల్లాలోని విలీన మండలాలైన విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు ముంపులోనే ఉన్నాయి. డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను నిలిపివేయడంతో శబరి నీటి ప్రవాహం తగ్గి 39 అడుగులకు చేరింది. ఎటపాక మండలంలోని నందిగామ - మురుమూరు గ్రామాల మధ్య రహదారిపై వరద నీరు ఉండటంతో భద్రాచలం - కూనవరం రాకపోకలు ఇంకా పునరుద్ధరణ కాలేదు. భద్రాచలం - చింతూరు జాతీయ రహదారి ఇంకా ముంపులోనే ఉండడంతో వందల సంఖ్యలో వాహనాలు రోడ్లపై బారులు తీరాయి. విఆర్.పురం మండలం శ్రీరామగిరి పంచాయతీలో కలెక్టర్ దినేష్ కుమార్ పర్యటించారు. పరిహారం, పునరావాసం అమలు చేసి తమను కాపాడాలని పోలవరం నిర్వాసితులు ఆయన్ని వేడుకున్నారు. కూనవరం మండలంలోని పెద్ద ఆర్యూర్ పంచాయతీ పరిధిలోని ఆర్యూర్, రేపాక, భగవాన్‌పురం, బండారుగూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. ముంపు బాధితులకు రూ.20 వేల తక్షణ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకులు, కిరోసిన్, బరకాలు ఇవ్వాలని కోరారు. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద ఉధృతి తగ్గింది. భద్రాచలం నుంచి కుక్కునూరుకు రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. వరద తగ్గుముఖం పట్టినా దాచారం-కుక్కునూరు, ముత్యాలంపాడు-వింజరం మధ్య ఉన్న కాజ్‌వేలు ఇంకా ముంపు నుంచి బయటపడలేదు. దీంతో ఇప్పటికీ 12 రోజులుగా 19 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక గ్రామాల్లో వరద నిలకడగా ఉంది. అయోధ్యలంక పరిధిలోని మర్రిమూల, పుచ్చల్లంక, రాయిలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలకు, ఏటిగట్టు పరివాహక గ్రామాలైన పెద్దమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలో ఎడమవైపు ఉన్న లంక భూముల్లోకి వరద నీరు చేరింది.

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

- అటకెక్కిన సూపర్ సిక్స్ పథకాలు : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఎన్నికల ముందు అమలు చేయలేని హామీలు ఇవ్వడం, అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని వైసిపి విమర్శించింది. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు సోమవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పిన ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయడం లేదన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు హామీలపై నాలుక మడతేస్తున్నారని, ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మౌనంగా వుండటం తగదని అన్నారు. ఇసుక ధర గతం కంటే ఎక్కువ వుందన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఈ ఏడాది అమలు చేయడం లేదని, రైతులు ఖరీఫ్ సాగు ప్రారంభించినా, వారికి ఇప్పటి వరకు పెట్టుబడి సాయం చేయలేదని, పిల్లలకు ఫీజులు చెల్లించలేదని, చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం ఇంకా ఇవ్వలేదని ఇలా అన్ని పథకాలకూ మంగళం పాడారని అన్నారు. ఎన్‌డిఎ కూటమిలో వున్నా ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రాజధాని పనుల కోసం రూ.15 వేల కోట్ల రుణాన్ని గొప్పగా ప్రచారం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

పనుల్లేక ఉసూరుమంటూ...

- వారం రోజులుగా ముంపులోనే లంక గ్రామాలు
- స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి- రాజోలు (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంకలు వారం రోజులుగా వరద నీటిలో నానుతున్నాయి. కొన్ని గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. దీంతో, జనజీవనం పూర్తిగా స్తంభించింది. వారం రోజులుగా ఇళ్లకే పరిమితం అవ్వడంతో వ్యవసాయ కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. చేతిలో చిల్లిగవ్వ లేక రేషన్ సరుకులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. గోదావరి వరద ఉగ్రరూపం దాల్చడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 407 గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. ఒక్క కోనసీమలోనే 78 ఆవాసాల్లో 25 వేల మందికిపైగా ముంపు బారిన పడినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. నిర్వాసితులు పలుచోట్ల ఏటిగట్టుపైనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. కాజ్‌వేలు నీట మునగడంతో పడవలపైనే ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. ముంపు కారణంగా 40 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 6,500 ఎకరాల్లో ఉద్యాన పంటలు పూర్తిగా వరద బారిన పడ్డాయి. 13 ఇళ్లు నేలమట్టం అయ్యాయి. వరదలకు అయినవిల్లిలో ఒకరు, పి.గన్నవరం బోటు ప్రమాదంలో మరొకరు మృతి చెందారు.

ప్రభుత్వం ఆదుకోవాలంటూ విజ్ఞప్తి

కోనసీమ జిల్లాలో వ్యవసాయ కార్మికులు అధికంగా ఉన్నారు. ముఖ్యంగా మామిడికుదురు, ముమ్మిడివరం, సఖినేటిపల్లి, రాజోలు, పి.గన్నవరం, ఐ.పోలవరం లంకల్లో వ్యవసాయ పనులు, పాడి, కొబ్బరి వలుపు, దింపు పనులను నిర్వహించుకుంటూ వేలాది మంది జీవనం సాగిస్తున్నారు. లంకల్లోని ప్రజలే కాకుండా మైదాన ప్రాంతాల నుంచి కూడా లంకల్లో పనులపైనే ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. వరదల కారణంగా సుమారు 70 వేల మందికిపైగా వ్యవసాయ కార్మికులు పనులను కోల్పోయారు. మైదాన ప్రాంతాల ప్రజలు ఇతర పనులకు వెళ్తున్నా, లంకల్లోనే ఆవాసాలు ఏర్పరుచుకుని జీవిస్తున్న కూలీలు వరదల కారణంగా పూర్తిగా పనులను కోల్పోయారు. తమకు ఎలాంటి ఆర్థిక సాయమూ అందలేదని, రేషన్ బియ్యంతోనే కాలం వెళ్లదీస్తున్నామని వారు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువాని లంకలో ముంపునకు గురైన బొప్పాయితోట

మరో మూడు రోజుల పాటు ప్రభావం

గోదావరి వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టినా మరో మూడు రోజుల పాటు ఉధృతి కొనసాగనుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో, లంక గ్రామాలకు ముంపు బెడద ఇంకా తప్పలేదు. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ నుంచి 15 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు విడుదలవుతోంది. లంకల్లో ముంపు స్థిరంగా ఉంది. వరద నీటితో కొట్టుకొస్తున్న విషసర్పాలు, విష పురుగులతో లంక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పరిహారం అందలేదు

గతేడాది వరదలకు నా ఇల్లు కూలిపోయింది. తిరిగి నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక ఏడాది కాలంగా లంకలోనే పాక వేసుకుని ఉంటున్నాం. కూలిన ఇంటికి నేటికీ పరిహారం అందలేదు. పునరావాస పరిహారం ఇవ్వాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రస్తుతం లంకలో ఉన్న ఇల్లు కూడా మునిగిపోయింది. ఏటా వరద సమయంలో ఏటుగట్టుపైనే జీవించాల్సి వస్తోంది.

- ఎన్.మరియమ్మ, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి మండలం

ఎలాంటి సాయమూ లేదు

వరదలు ఏటిగట్టును తాకడంతో సుమారు 70 కుటుంబాలు టెకిశెట్టిపాలెం ఏటి గట్టుపైనే పునరావాసం ఏర్పాటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు మాకు ఎలాంటి సాయమూ అందలేదు. కనీసం ఆహారం కూడా సరఫరా చేయలేదు. వరదల సమయంలో ఎప్పుడూ మాది ఇదే పరిస్థితి. జీవనం కష్టంగా మారుతుంది. అధికారులు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డు ఉంటేనే 25 కిలోల బియ్యం ఇస్తున్నారు. లేకుంటే ఆ బియ్యం కూడా ఇవ్వడం లేదు.

- పి.కుమారి, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి మండలం

అన్యాక్రాంత భూములు లెక్కలు తేల్చాల్సిందే

- రెవెన్యూ సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జిల్లాల వారీగా అన్యాక్రాంతమైన భూముల లెక్కలు తేల్చితీరాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆయన రెవెన్యూ శాఖపై మంత్రి అనగాని సత్యనారాయణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 22(ఎ) నుంచి ఫ్రీ హోల్డ్ చేసిన భూమిని రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద పున:పరిశీలన చేయడంతో పాటు వాటిలో నిజమైన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారో లెక్కలు తేల్చాలని అధికారులకు చెప్పారు. త్వరలో రాజముద్రతో భూయజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామని తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తి వివరాలు, ఆ ఆస్తి అడ్రస్ వద్దకు తీసుకెళ్లే మ్యాప్ కూడా వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు రాజముద్రతో ఉన్న పాస్ పుస్తకాన్ని సిఎంకు చూపించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ ప్రజల పాస్ పుస్తకాలపై మాజీ సిఎం తన బొమ్మల కోసం రూ.15 కోట్లు ఖర్చు చేశారన్నారు. భూముల రీసర్వే పేరుతో గత ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసిందని అన్నారు.

అక్రమార్కుల్ని వదిలిపెట్టం : రెవెన్యూ మంత్రి అనగాని

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనలో ఎంతటి వారున్నా శిక్షార్హులేనని, అక్రమార్కుల్ని వదిలే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాకు వెల్లడించారు. గతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన భూములపై సమీక్షిస్తామన్నారు. కోట్ల విలువైన భూములను లక్షల రూపాయలకే కేటాయించా రని ఆయన తెలిపారు. రెవెన్యూశాఖ కార్యదర్శి మూడు రోజులు మదనపల్లెలోనే ఉండి ఘటనపై అధ్యయనం చేసి సిఎంకు నివేదిక ఇచ్చారన్నారు. ఆగస్టు 5న అన్ని జిల్లాల కలెక్టర్లతో సిఎం చంద్రబాబు రెవెన్యూశాఖపై లోతైన సమీక్ష నిర్వహిస్తారని, ఆ సమీక్షకు కలెక్టర్లు పూర్తి స్థాయిలో సిద్ధమై రావాలని మంత్రి అనగాని పేర్కొన్నారు.

22(ఎ) నుంచి ఒకే సమయంలో14వేల ఎకరాలు తొలగింపు : ఆర్‌పి సిసోడియా

22(ఎ)కు సంబంధించిన భూములు 14వేల ఎకరాలు ఒకేసారి జాబితా నుంచి తొలగించారని, ఆయా భూములన్నీ ప్రైవేటు వ్యక్తులకు చెందినవేనని తాము గుర్తించినట్లు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పేర్కొన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో షార్టు సర్క్యూట్ జరిగే అవకాశం లేదన్నారు. రసాయనం వాడకుండా భారీగా మంటలు వచ్చే అవకాశం లేదన్నారు.

పెండింగ్ ఆర్థిక బకాయిలు చెల్లించాలి

- ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ట్రెజరీలలో మంజూరైన ఆర్థిక బకాయిలు సిఎఫ్‌ఎంఎస్ నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, ఎపిజిఎల్‌ఐపిఎఫ్, మెడికల్ బిల్లులు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిఎస్ గణపతిరావు, కె ప్రకాష్‌రావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత టిడిపి పాలనలో ఉద్యోగి ఆర్థిక బిల్లులు వారంలోపు జమయ్యేవని తెలిపారు. వైసిపి హయాంలో ఏళ్ల తరబడి ఎదురుచూసినా ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో జెన్‌కో

- వడ్డీలు కూడా చెల్లించలేని వైనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి జెన్‌కో అప్పుల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం ఆ సంస్థ తీసుకున్న అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉంది. జెన్‌కో విద్యుత్‌ను వాడుకుంటున్న డిస్కంలు నిధులను మాత్రం చెల్లించడం లేదు. దీంతో బొగ్గు సరఫరా చేస్తున్న కంపెనీలు,అప్పులు తీసుకున్న బ్యాంకులు, కాంట్రాక్టు పనులు చేసిన సంస్థలకు జెన్‌కో బిల్లులను చెల్లించలేక ఆర్థికంగా సతమతమవుతోంది. సుమారు రూ.20వేల కోట్ల వరకు జెన్‌కో అప్పుల్లో ఉంది. వీటిల్లో రూ.7,703 కోట్లు తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ఇది రాష్ట్రవిభజన సమయంలో తెలంగాణ డిస్కంలకు అందించిన విద్యుత్‌కు గాను ఆ రాష్ట్రం చెల్లించాల్సి ఉంది. అయితే పదేళ్ల నుంచి కూడా ఈ బకాయిల అంశం అపరిష్కృతంగానే ఉంది. ఇటీవల ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చింది. ఇది కాకుండా నెలవారీ విద్యుత్ వినియోగించుకున్నందుకు రాష్ట్ర డిస్కంల నుంచి సుమారు రూ.3,500 కోట్ల బకాయిలు జెన్‌కోకు రావాల్సి ఉంది. జెన్‌కో కూడా ప్రస్తుతం అత్యవసరం కింద ఇతర సంస్థలకు నెలవారీ చెల్లించాల్సిన బకాయిలు కూడా సుమారు రూ.3,000కోట్లు ఉన్నాయి. బొగ్గు కొనుగోలు చేస్తున్న సంస్థలకు రూ.1,275కోట్లు తక్షణం చెల్లించాల్సి ఉంది. ఇందులో సింగరేణి సంస్థకు రూ.300కోట్లు చెల్లించాలి. బొగ్గు రవాణా చేసిన రైల్వే ఇతర సంస్థలకు రూ.972కోట్లు, ప్లాంట్లలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.400కోట్ల బకాయిలు ఉన్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, ఇతర వాటికి సుమారు మరో రూ.300కోట్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం నిధులు లేకపోవడంతో వీటిని ఎలా చెల్లించాలనే అంశంపై అధికారులు సతమతమవుతున్నారు.

పులుల సంఖ్య పెంచే దిశగా చర్యలు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోస్టరును ఆవిష్కరిస్తున్న పవన్‌కళ్యాణ్

రాష్ట్రంలో పులుల సంఖ్య పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని అటవీశాఖాధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. వాటి సంరక్షణ కోసం ప్రణాళికలు సిద్ధం చేయా లన్నారు. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని అరణ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు పవన్‌కల్యాణ్ చెప్పారు. అడవిలో పులులను కాపాడితే అడవులను అవే రక్షిస్తాయని అన్నారు. తద్వారా పచ్చదనం పెరిగితే పర్యావరణ సమతౌల్యం ఉంటుందన్నారు. అటవీశాఖ మంత్రిగా రాష్ట్రంలోని అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, అటవీశాఖ దళాధిపతి చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు ఎకె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె మాజీ ఎమ్మెల్యేపై కేసు

- కర్నూలు రేంజ్ డిఐజి ప్రవీణ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డుల దహనం కేసులో మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై కేసు నమోదు చేశామని కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. ఆయన ఇంట్లో ఉండకూడని కొన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం రాత్రి మదనపల్లి డిఎస్‌పి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. అనుమానితులను విచారించాడమే కానీ అదుపులోకి ఎవ్వరినీ తీసుకోలేదని చెప్పారు. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు వచ్చిన తర్వాత నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ కేసును సాంకేతిక టెక్నాలజీల సహకారంతో పరిశోధిస్తున్నామని, సిసి టివి పుటేజీలను, 2000 పైగా ఫోన్ కాల్ డేటాను పరిశీలించామని తెలిపారు. వీటన్నింటి ఆధారంగా అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేసి విలువైన ఆధారాలు సేకరించామని వివరించారు. ఈ పరిశోధనకు ఉపయోగపడని ఫైళ్లను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిపై ఎనిమిది కొత్త కేసులు రిజిస్టర్ చేశామని చెప్పారు. ఈ కేసులో ఇప్పటి వరకు 15 మంది అనుమానితులను విచారించామని, వారిలో స్థానిక వైసిపి నాయకులు, రైస్‌మిల్ యజమాని మాధవరెడ్డి ఇంటిలో 500 ఇళ్ల స్థలాలు, భూముల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నామని తెలిపారు. ఆయన పరారీలో ఉన్నారన్నారు. హైదరాబాదులోని శశికాంత్ ఇంట్లో మదనపల్లెకి చెందిన భూముల రికార్డులు కూడా దొరికాయని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిఎ తుకారం ఇంట్లో కూడా సోదాలు చేశామని తెలిపారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ఇంట్లో ఫైళ్ల కోసం సోదాలు చేశామన్నారు. సిఐడి అధికారుల సహకారంతో 15 టీములు విచారణ చేస్తున్నాయని చెప్పారు. తమను మాధవరెడ్డి బెదిరించారని రెవెన్యూ అధికారులకు కొంతమంది బాధితులు ఫిర్యాదు చేశారని, అటువంటి బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తామని డిఐజి స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఇన్వెస్టిగేషన్ అధికారి రాజ్ కమల్ పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో పలుమార్పులు

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేవాదాయ శాఖలో పలు మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆలయాల పరిరక్షణ, అర్చకులకు ఆర్థిక ప్రయోజనాలు, భద్రత వంటి అనేక అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే ఆర్థికశాఖకు చేరాయి. ప్రధానంగా ఆలయాలకు చెందిన ఆస్తులను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా ఎండోమెంట్ బోర్డును ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. . ఆలయాల ఆస్తులనే కాకుండా ఆలయ సత్రాల ఆస్తుల రక్షణను కూడా బోర్డు పరిధిలోకి తీసుకురానున్నారు. ఇదే సమయంలో ఆలయాల్లోని వైదిక, ఆగమ శాస్త్రాల అమలుకు సంబంధించిన అంశాల్లో అధికారుల ప్రమేయం ఉండరాదని ప్రతిపాదించారు. ఏడాదికి 50 వేల కన్నా తక్కువ ఆదాయం ఉండే ఆలయాల్లో అర్చకులకు ధూపదీప నైవేద్యం కింద ఇప్పుడు ఇస్తున్న ఐదు వేలను పది వేలకు పెంచాలని కూడా ప్రతిపాదించారు. అలాగే 50 వేల కన్నా ఎక్కువ ఆదాయం ఉన్న ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కింద ఇస్తున్న 10 వేలను 15 వేలకు పెంచాలని కూడా నిర్ణయించారు.

చారిత్రాత్మక కట్టడాల పరిరక్షణ

రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఉన్న చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించేందుకు ఉన్నతాధికారులు, మత పెద్దలతో ఒక కమిటీ ఏర్పాటుచేయాలని ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేయగా, అందుకోసం చర్యలు కూడా ప్రారంభించారు. ఇందులో తిరుమల, ఒంటిమిట్ట వంటి ప్రాచుర్యం కలిగిన ఆలయాలు ఉన్నట్లు చెబుతున్నారు.

భద్రతకు కమిషన్

ఇప్పటికే అనేక ఆలయాల్లో అవకతవకలు, భద్రతాపరమైన సమస్యలు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటుచేసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దాడులకు తెగబడేవారిని కఠినంగా శిక్షించేందుకుగాను పోలీసు శాఖ, దేవాదాయ శాఖల సమన్వయంతో కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. వేద విద్యా కోర్సులు పూర్తిచేసి ఉద్యోగం రాని వారికి నెలకు మూడు వేల రూపాయలను ఇవ్వాలని ప్రతిపాదించారు.

ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి

- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముంపు గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. రాష్ట్రంలో జలాశయాల్లో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ప్రమాదాల నివారణ చేపట్టేలా వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలను రాజముద్రతో అందజేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం పట్ల మంత్రి గొట్టిపాటి హర్షం వ్యక్తం చేశారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత

రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వే కాంట్రాక్టు కార్మికులతోపాటు గూడ్స్ షెడ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి, రక్షణ, కనీస వేతనం నెలకు రూ.26 వేలు, పిఎఫ్, ఇఎస్‌ఐ కల్పించాలని రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఆలిండియా డే సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్స్, డిఆర్‌ఎమ్ ఆఫీస్‌ల వద్ద, వర్క్‌షాప్ గూడ్స్‌షెడ్స్ వద్ద సోమవారం ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నం (ఈస్ట్‌కోచ్ రైల్వే) దక్షిణ మధ్య రైల్వే డివిజన్, విజయవాడ, గుంతకల్ డివిజన్స్ దక్షిణ మధ్య రైల్వేలోని వర్క్‌షాప్‌లు, గూడ్స్ షెడ్స్ వద్ద ధర్నాలు జరిగాయి. ఈ ధర్నా కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వివిఎల్ నరసింహులు, కెవిఎస్‌వి కుమార్, ఎం రాంబాబు, అవతారం, అప్పారావు (విశాఖపట్నం), పుల్లారెడ్డి, సాయిరెడ్డి, (తాడేపల్లిగూడెం) వై ఆదిలక్ష్మి (విజయవాడ) పాల్గొన్నారు.

2న కేబినెట్ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆగస్టు రెండున సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జరగనుంది. ఈ మేరకు సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి పలు కీలక అంశాలపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

జమచేయాల్సిన మొత్తంపై చర్యలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వివరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు సేవా కేంద్రాల ద్వారా జరిగిన అమ్మకాలు, విపిఏలు జమచేయాల్సిన మొత్తాల గురించి ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో సమీక్షలు జరుపుతూ తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎమ్‌డి శివప్రసాదు తెలిపారు. వేరుశనగ విత్తనాల్లో చేతివాటం పేరుతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తపై ఆయన వివరణ పంపించారు. ఖరీఫ్‌లో వివిధ రకాల విత్తనాల సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోడల్ ఏజెన్సీ మాత్రమేనని తెలిపారు. ఖరీఫ్ 2024లో వేరుశనగ విత్తనాలు 3.03 లక్షల క్వింటాళ్ల పరిమాణం సరఫరా కోసం నిర్దేశించుకోగా 2.93 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. వీటి తాలూకూ రావాల్సిన నాన్ సబ్సిడీ సొమ్ము రూ.3.14 కోట్లు పెండింగ్ ఉందని తెలిపారు.

కబ్జాలపై అధిక వినతులు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వంలో జరిగిన కబ్జాలపై అధిక వినతులు వస్తున్నాయని ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ అధికారప్రతినిధి పనబాక లక్ష్మితో కలిసి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, టిడిపి కార్యకర్తల నుంచి వచ్చిన వినతులను వారు స్వీకరించారు. అనంతరం పనబాకతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 110 వినతులు వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన కబ్జాలపై అధిక వినతులు అందాయని, వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఎక్స్ ఆర్మీ అధికారులు కూడా భూ సమస్యలపై వినతులు ఇచ్చారని తెలిపారు. అనర్హులుగా చూపి పింఛన్లు నిలిపివేసిన అర్హులకు న్యాయం చేస్తామని అన్నారు. ఆ శాఖ మంత్రికి పింఛను సమస్యలపై అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని కృషి చేశారని వెల్లడించారు.

గోబెల్స్ ప్రచారం చేస్తున్న జగన్ : వర్ల రామయ్య

మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. 11 ఛార్జిషీట్లలో ముద్దాయిగా ఉండి కోర్టులకు హాజరుకాకుండా తప్పించుకుంటూ జగన్ అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోగొట్టుకున్న అధికారం పొందాలని జగన్ అతిగా ఆవేశపడుతున్నారని పేర్కొన్నారు. అవినీతి సొమ్ముతో ఢిల్లీ వెళ్లి అక్కడ అబాసుపాలయ్యారని విమర్శించారు. జగన్ అక్రమాస్తుల కేసులో ఎందుకు జాప్యం జరుగుతుందని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని గుర్తు చేశారు.

వేతనాల కోసం రోడ్డెక్కిన ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

- ధర్నాకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు మద్దతు
- దశల వారీగా చెల్లిస్తాం : రైతుసాధికారత సంస్థ సిఇఒ

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ప్రదర్శనలో పాల్గొన్న లక్ష్మణరావు, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

బకాయి వేతనాల కోసం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు రోడ్డెక్కారు. 16 నెల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు, గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు తరలివచ్చారు. వీరికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు మద్దతు తెలిపి మాట్లాడారు. సంవత్సరానికి పైగా వేతనాలు చెల్లించకుంటే ఉద్యోగులు ఎలా బతకాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వ్యవసాయం అభివృద్ధి ప్రాధాన్యత ఇస్తామని ఇటీవల బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారని, అందుకు అనుగుణంగా దిగువ స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగుల సాధక బాధకాలు కూడా పట్టించుకోవాలని కోరారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణమూర్తి కె.హరిబాబు మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయం అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగుల వేతనాల చెల్లింపులో ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి.నరసింహారావు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సాధికార సంస్థ సిఇఒ రామారావుకు వినతిపత్రం అందజేశారు. సిఇఒ స్పందిస్తూ కొన్ని అనుకోని ఇబ్బందుల వల్ల కేంద్రం నుంచి వచ్చిన నిధులు సకాలంలో ఉద్యోగుల అకౌంట్‌లో జమకాలేదని, దీనివల్ల ఉద్యోగులకు జీతాలు చెల్లించలేకపోయామన్నారు. దానిని సరిచేసి, బకాయి వేతనాలు చెల్లించేందుకు గత ఐదారు నెలలుగా ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఫలితంగా ఇప్పటివరకు మూడు నెలల వేతనాలు చెల్లించామని, మరో నాలుగైదు నెలల వేతనాలను ఆగస్టులో చెల్లిస్తామని, మిగిలిన బకాయి మొత్తాన్ని అక్టోబర్ నాటికి పూర్తిగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యలపై జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ధర్నాకు ముందు గోరంట్లలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం సెంటర్ నుంచి రైతు సాధికార సంస్థ కార్యాలయం వరకు ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వరప్రసాద్, సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శివసాయి, యూనియన్ వివిధ జిల్లాల నాయకులు వి.వెంకటేశ్వర్లు, పాండురంగారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విహారం... విషాదాంతం

- తెలుగుగంగ జలాశయంలో పడి ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి- దువ్వూరు (చాపాడు, వైఎస్ఆర్ జిల్లా)

జలాశయంలోకి దిగేముందు సెల్ఫీ తీసుకుంటున్న యువకులు

విహార యాత్ర విషాదాంతమైంది. వైఎస్ఆర్ జిల్లా దువ్వూరు మండలం చల్లబసాయపల్లె సమీపంలోని తెలుగుగంగ జలాశయం-1లో ఈతకు దిగిన ముగ్గురు యువకులు మృతి చెందారు. మైదుకూరు సిఐ మస్తాన్, దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం... వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు పవర్ హౌస్ రోడ్డుకు చెందిన ఎస్.కె.ముద్దా పీర్ (22), మౌలానా ఆజాద్ స్ట్రీట్‌కు చెందిన వి.రహమతుల్లా (23), సుందరాచార్యుల వీధికి చెందిన వి.షాహిద్ (23) కలిసి తెలుగుగంగ జలాశయం-1కు ఆదివారం విహార యాత్రకు వచ్చారు. ఆ ముగ్గురూ కలిసి సెల్ ఫోన్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. జలాశయంలోకి ఈతకు దిగారు. నీటిలో మునిగి గల్లంతయ్యారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గట్టుపై దొరికిన సెల్ ఫోన్లు, పర్సుల ఆధారంగా యువకులను ప్రొద్దుటూరుకు చెందిన వారిగా గుర్తించారు. గల్లంతైన వారి కోసం అగ్నిమాపక సిబ్బంది సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
మందడం బ్రాంచ్, తుళ్ళూరు మండలం
4-115, మెయిన్ రోడ్, జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా, మందడం, గుంటూరు జిల్లా- 522 503, ఫోన్ : 08645-243110/111

స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం)
(స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, **బ్యాంక్ ఆఫ్ బరోడా, మందడం బ్రాంచ్** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 3తో చదివే సదరు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ నోటీసులో పేర్కొన్న బకాయి **తేది.13.04.2024 నాటికి రూ.3,72,213.66 (అక్షరాల మూడు లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల పదమూడు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే) + 14.04.2024** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఖర్చులతో నోటీసు తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీమతి గుమ్మడిదల నాగ లక్ష్మి, భర్త : శ్రీ గుమ్మడిదల మంగయ్య,** డి.నెం.3-112-1, మందడం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522503. **సహ-ఋణగ్రహీత: శ్రీ గుమ్మడిదల మంగయ్య,** డి.నెం.3-112-1, మందడం, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522503.వార్లను కోరుతూ **తేది.19.04.2024 న డిమాండ్ నోటీసు** ను జారీచేసినారు.

ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాదారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు చట్టము నందలి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002, రూల్ 8తో చదివే సదరు సెక్షన్ 13(4) యొక్క చట్టం 13 క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.24.07.2024 న స్వాధీనం** చేసుకున్నారు.

ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైననూ **తేది.13.04.2024 నాటికి రూ.3,72,213.66 (అక్షరాల మూడు లక్షల డెబ్బై రెండు వేల రెండు వందల పదమూడు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే) + 14.04.2024** నుండి వర్తించని వడ్డీ ఇతర చార్జీలు మొ॥నవి **బ్యాంక్ ఆఫ్ బరోడా, మందడం బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారులకు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు
షెడ్యూలు-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, మందడం సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి రాజధాని నగరం పరిధిలో, మందడం ఏరియా, సర్వే నెం.లు. 190,191,193 & 196లో విస్తీర్ణం ఎ.3.75 సెంట్లు భూమి.
షెడ్యూలు-బి : అమరావతి రాజధాని నగరం, మందడం, PMAY(U)-YSR జగనన్న నగర్, సర్వే నెం.190,191,193 & 196 లో ఉన్న మొత్తం బ్లాక్ ఏరియా భూమి 608 చ.గ.ల విస్తీర్ణంలో 19 చ.గ.ల అవిభాజ్యపు వాటా గల 3వ అంతస్తులో బ్లాక్ B2 నందు ఫ్లాట్ నెం. TF8, లో 365 చ.అ.ల (సాధారణ ప్రాంతాలలో దామాషా వాటాతో సహా).
బ్లాక్ హద్దులు : ఉత్తరం : ఓపెన్ స్పేస్, **తూర్పు :** బ్లాక్ నెం.బి3, **దక్షిణం :** 9.00 మీ॥ల వెడల్పు గల రోడ్, **పడమర :** ఓపెన్ స్పేస్.
3వ అంతస్తు, ఫ్లాట్ నెం.TF8 నకు హద్దులు : ఉత్తరం : ఫ్లాట్ నెం.TF-7, **తూర్పు :** బ్లాక్ నెం.B3, **దక్షిణం :** 9.00 మీ॥ల వెడల్పు గల రోడ్, **పడమర :** ఫ్లాట్ నెం.TF-1.

తేది : 24.07.2024 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : మందడం — బ్యాంక్ ఆఫ్ బరోడా

జనసేన సభ్యత్వ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు గడువును మరో వారం పొడిగిస్తున్నట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పార్టీ నాయకులు కె నాగబాబు తెలిపారు. గతేడాది కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేయాలన్నారు. అనంతరం పార్టీ నాయకులతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకు దాదాపు 10 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో 5 వేలు నమోదయ్యేలా కృషి చేద్దామని పార్టీ శ్రేణులకు నాగబాబు సూచించారు. ఎమ్మెల్సీ హరి ప్రసాద్ మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు ప్రక్రియలో ప్రతిఒక్కరూ చాలా అద్భుతంగా పనిచేశారన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పార్టీ కోశాధికారి ఎవి రత్నం, ఐటి సెల్ ఛైర్మన్ మిరియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
మందడం బ్రాంచ్, తుళ్ళూరు మండలం
4-115, మెయిన్ రోడ్, జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా, మందడం, గుంటూరు జిల్లా- 522 503, ఫోన్ : 08645-243110/111.

ఋణగ్రహీత & సహ-ఋణగ్రహీతలకు కొరకు డిమాండ్ నోటీసు
(SARFAESI ACT, 2002 లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (2) క్రింద)

ఋణగ్రహీత : శ్రీమతి షేక్ అలిమా భీ, భర్త : శ్రీ షేక్ ఖలీషా, డి.నెం.5 33, మసీదు బజార్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503.
సహ-ఋణగ్రహీత : శ్రీ షేక్ ఖలీషా, డి.నెం.5 33, మసీదు బజార్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503.

విషయము : మా బ్యాంక్ ఆఫ్ బరోడా, మందడం బ్రాంచ్ వద్ద కలిగియున్న ఋణ సదుపాయం గురించి.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారా **తేది.22.07.2024** న మీకు తిరుగు రశీదులతో కూడిన **డిమాండ్ నోటీసు** మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయడమైనది. మీరు చిరునామాలో లేనందున తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరుగు వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది.03.04.2024** నుండి నిరర్ధక ఆస్తిగా **(ఎన్.పి.ఎ)** పరిగణించబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తము **తేది.21.07.2024 నాటికి రూ.3,85,355.22 (అక్షరాల మూడు లక్షల ఎనభై ఐదు వేల మూడు వందల యాభై ఐదు రూపాయల ఇరవై రెండు పైసలు మాత్రమే) + తేది.22.07.2024 నుండి వర్తించని వడ్డీతో** పాటు చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలతో మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు పేర్కొన్న విధంగా **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకము, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

స్థిరాస్తి వివరములు
షెడ్యూలు-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, మందడం సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి రాజధాని నగరం పరిధిలో, మందడం ఏరియా, సర్వే నెం.లు. 190,191,193 & 196లో విస్తీర్ణం ఎ.3.75 సెంట్లు భూమి.
షెడ్యూలు-బి : అమరావతి రాజధాని నగరం, మందడం, PMAY(U)-YSR జగనన్న నగర్, సర్వే నెం.190,191,193 & 196 లో ఉన్న మొత్తం బ్లాక్ ఏరియా భూమి 608 చ.గ.ల విస్తీర్ణంలో 19 చ.గ.ల అవిభాజ్యపు వాటా గల 2వ అంతస్తులో బ్లాక్ B3 నందు ఫ్లాట్ నెం. SF 4, లో 365 చ.అ.ల (సాధారణ ప్రాంతాలలో దామాషా వాటాతో సహా).
బ్లాక్ హద్దులు : ఉత్తరం : ఓపెన్ స్పేస్, **తూర్పు :** ఓపెన్ స్పేస్, **దక్షిణం :** 9.00 మీ॥ల వెడల్పు గల రోడ్, **పడమర :** బ్లాక్ నెం.B2.
2వ అంతస్తు, ఫ్లాట్ నెం.SF 4 నకు హద్దులు : ఉత్తరం : ఓపెన్ స్పేస్, **తూర్పు :** ఫ్లాట్ నెం.SF-5, **దక్షిణం :** ఫ్లాట్ నెం.SF-3, **పడమర :** బ్లాక్ నెం.B2.

తేది : 22.07.2024 — సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్
ప్రదేశం : మందడం — బ్యాంక్ ఆఫ్ బరోడా

జి.నాగ బాలాజీ

మంతెన అనురాగ్

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో మెరిసిన కృష్ణా విద్యార్థులు

- ఇద్దరికి రజత పతకాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు రజక పతకాలు సాధించారు. ఈ నెల 24, 25 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సుబ్రహ్మణ్యం నాదర్ విశ్వవిద్యాలయంలో హెచ్‌సిఎల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ ఎడిషన్ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థులు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిలోపామర్రు మండలం జమీగొల్వేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మంతెన అనురాగ్, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి గంటేటి నాగ బాలాజి ఉన్నారు. ఇటీవల మన రాష్ట్రంలోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన సౌత్ జోన్ ఖోఖో పోటీల్లో ఈ ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరచిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పతకాలు సాధించిన విద్యార్థులకు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఉషారాణి, కృష్ణ కుమారి అభినందనలు తెలిపారు.

దొండపాడు లో టిడ్కో గృహ సముదాయాల వద్ద మాట్లాడుతున్న మంత్రి నారాయణ

టిడ్కో గృహాలకు మౌలిక వసతులు

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్రంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు మండలం మందడం, దొండపాడు గ్రామాల్లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను సిఆర్‌డిఎ కమిషనర్ కాటమనేని భాస్కర్, టిడ్కో ఎండి సాయికాంత్ వర్మ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం దొండపాడులో మీడియాతో మంత్రి మాట్లాడుతూ అవసరమైన వసతుల కల్పనకు నెల రోజుల్లో తగు చర్యలు తీసుకుంటామన్నారు. 2014 - 19 టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 7,14,800 టిడ్కో గృహాలను నిర్మించాలని సంకల్పించిందని, వీటిలో ఐదు లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. గతంలోనే టిడిపి ప్రభుత్వ హయాంలో 90 శాతం మేర ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి పేదలు, నిరుపేదలకు నాణ్యమైన టిడ్కో ఇళ్లు అవసరంలేదని 2,62,216 గృహాలకు తగ్గించిందని మంత్రి చెప్పారు. రాజధాని రైతులకు త్వరలో కౌలు చెల్లిస్తామన్నారు. ఈ సందర్భంగా దొండపాడులో టిడ్కో లబ్ధిదారులు కనీస వసతులైనా లేవని, బ్యాంకర్లు కిస్తీలు కట్టమని ఒత్తిడి చేస్తున్నారని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో సచివాల యం, హైకోర్టులో పనిచేసే వారికి అమరావతి సామాజిక భృతి చెల్లించే అంశాన్ని పరిశీలించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra ONE FAMILY ONE BANK
BANK OF MAHARASHTRA
Zonal Office, Vijayawada 1st Floor, Infinity Plaza, D. No: 59A-21-7/3, High School Road, Patamata, Vijayawada, AP-520007 TELE: 0866-2431225

AX76/Vijayawada/SARFAESI/2024-25 — 25/07/2024

(రూలు 8(1) స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర, చీఫ్ మేనేజర్, జోనల్ ఆఫీసు, విజయవాడ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ [illegible]

కొల్లేటరల్ ఆస్తి-3: లక్ష్మిపతి నగర్, పటమట, విజయవాడ, పటమట సబ్-రిజిస్ట్రార్, ఎన్‌టిఆర్ జిల్లా వద్దగల ఆర్ఎస్.నం.193/1, డోర్ నం.74-10/1-11 లో గల ఈజిమెంట్ హక్కులన్నింటితో 336.25చ.గ.లు (13+323.25)చ.గ.లు) విస్తీర్ణపు ఖాళీ నివాస సైటు. సరిహద్దులు: **తూర్పు:** 33అ.ల వెడల్పు మున్సిపల్ కార్పొరేషన్ రోడ్, **దక్షిణం:** నిమ్మగడ్డ పద్మావతి ఆస్తి, **పడమర:** ఇతరుల ఆస్తి, **ఉత్తరం:** దొడ్డపనేని శివ ప్రసాద్ చేత ఇతరులకు విక్రయించబడిన ఆస్తి.

తేది: 30.07.2024 — సం/- చీఫ్ మేనేజర్,, అధీకృత అధికారి,
ప్రదేశం: విజయవాడ — జోనల్ ఆఫీసు, విజయవాడ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.

తయారీలో చైనాతో పోటీ సవాలే..!

- భారత్ కంటే ఆరు రెట్లు పెద్దది
- ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : తయారీ రంగంలో చైనాతో పోటీ పడటం పెద్ద సవాలేనని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అన్నారు.

ఇఎల్‌సిఐఎ టెక్ సమ్మిట్ 2024లో నారాయణ మూర్తి మాట్లాడుతూ.. తయారీలో మనకంటే చైనా ఆరు రెట్లు ముందంజలో ఉందన్నారు. భారత్ ఆ స్థాయికి చేరాలనే కల సాహసోపేతమేనన్నారు. గ్లోబల్ సూపర్ పవర్, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా అవతరించాలని భారత్ ఆశయంగా ఉందన్నారు. అయితే.. గ్లోబల్ తయారీ హబ్‌గా మారే రేసులో చైనా చాలా ముందుందని పేర్కొన్నారు. "చైనా ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద కర్మాగారంగా మారింది. ఇతర దేశాల్లోని సూపర్ మార్కెట్లలోని వస్తువులు దాదాపు 90 శాతం చైనాలోనే తయారవుతాయి. అవి భారతదేశ జిడిపికి ఆరు రెట్లతో సమానం." అని అన్నారు.

"భారత్ కంటే చైనా ఆర్థిక వ్యవస్థ చాలా పెద్దది. చైనా జిడిపి 17 లక్షల కోట్ల డాలర్ల విలువ చేస్తుంది. భారత జిడిపి 3 లక్షల కోట్ల డాలర్లు మాత్రమే. దీంతో పోల్చితే స్పష్టమైన వ్యత్యాసం కనబడుతుంది. ఆర్థిక అంతరాన్ని పరిశీలించవచ్చు. తయారీలో వృద్ధిని సాధించడంలో ప్రభుత్వ మద్దతు, ప్రజా పాలన కీలక పాత్రను పోశిస్తుంది. భారతదేశం వంటి దేశంలో ఇప్పటికీ ప్రతిస్పందన సమయం, పారదర్శకత, జవాబుదారీతనం, వేగం, ప్రభుత్వ పాలన మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి పెరుగుదలకు ప్రభుత్వం, పరిశ్రమల మధ్య తత్సంబంధాలు అవసరం." అని మూర్తి అన్నారు. ఐటి రంగ ఎగుమతుల్లో భారత్ వృద్ధి సాధిస్తుండగా.. తయారీ రంగం మాత్రం దేశీయ సహకారం, ప్రభుత్వ మద్దతు వంటి వాటి మీద ఆధారపడి ఉంది. కాబట్టి ఇక్కడ లక్ష్యాలను చేరుకోవాలంటే.. ప్రభుత్వాల పాత్ర చాలా కీలకమని నారాయణ మూర్తి అన్నారు. ఇది మెరుగుపడాలంటే ప్రభుత్వం, పరిశ్రమల మధ్య సమాచారం లోపాలను తగ్గించాలని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యాపారవేత్తలు మార్కెట్ పరిస్థితులను మెరుగ్గా అంచనా వేయాలని, అప్పుడే తయారీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి, రాబోయే అవకాశాలను ఉపయోగించుకోవడానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవాలన్నారు.

IN THE COURT OF THE VI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
O.S. No. 92 of 2024

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by it Sr. Manager (Law)& Authorized Officer,
...Plaintiff
AND
Sri.K.Kotswara Rao
...Defendant

To Sri.K.Kotswara Rao, S/o.Santha Rao, Aged about 46 years, Occ: Business, R/o.Co Karthikeya Hotel Near Janda Chettu, Kolakaluru, Tenali, A.P-522307.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs2,44,063-17ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 02-08-2024.

In case of your failure to attend before the Court on **02-08-2024** at **10-30** A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYD-50

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయండి

- ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. గ్యారేజ్ సిబ్బంది అందరికీ కొత్త టెక్నాలజీపై శిక్షణ ఇచ్చి ఆ మేరకు టూల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంది. ఈ మేరకు ఆర్‌టిసి ఉన్నతాధికారులకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నరసయ్య సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 129 ఆర్‌టిసి డిపోల్లోని గ్యారేజ్‌లలో పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగులకు విలీనానికి ముందున్న అన్ని రకాల అలవెన్సులు, ఇన్సెంటివ్ స్కీములను పునరుద్ధరణ చేయాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత దృష్ట్యా పనిచేయని, పనిచేసే ప్రదేశాలలో ఆర్‌ఒ ప్లాంటులను వెంటనే మరమ్మతులు చేయించి సిబ్బందికి స్వచ్ఛమైన మంచినీరు అందేటట్లు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సెలవుల విషయంలో వేధింపులు ఆపాలని కోరారు. అన్ని డిపోల్లో భవనాలు, షెడ్ల మరమ్మతులను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా — स्वाधीनता notice:

bank of baroda header: बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
మందడం బ్రాంచ్, తుళ్ళూరు మండలం
4-115, మెయిన్ రోడ్, జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా, మందడం, గుంటూరు జిల్లా- 522 503, ఫోన్ : 08645-243110/111

స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం)
(స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, **బ్యాంక్ ఆఫ్ బరోడా, మందడం బ్రాంచ్** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 3తో చదివే సదరు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ నోటీసులో పేర్కొన్న బకాయి **తేది.13.04.2024 నాటికి రూ.3,79,287.34/- (అక్షరాల మూడు లక్షల డెబ్బై తొమ్మిది వేల రెండు వందల ఎనభై ఏడు రూపాయల ముప్పై నాలుగు పైసలు మాత్రమే) + 14.04.2024** నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఖర్చులతో నోటీసు తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీత : శ్రీమతి కామినేని భవాని, భర్త : కామినేని గోపి,** డి. నెం.6-51ఎ, మందడం గచ్చు సెంటర్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522503. **సహ-ఋణగ్రహీత: శ్రీ కామినేని గోపి,** డి. నెం.6-51ఎ, మందడం గచ్చు సెంటర్, తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522503.వార్లను కోరుతూ **తేది.19.04.2024 న డిమాండ్ నోటీసు** ను జారీచేసినారు.

ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాదారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు చట్టము నందలి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002, రూల్ 8తో చదివే సదరు సెక్షన్ 13(4) యొక్క చట్టం 13 క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.24.07.2024 న స్వాధీనం** చేసుకున్నారు.

ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారు మరియు సాదారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైననూ **తేది.13.04.2024 నాటికి రూ.3,79,287.34/- (అక్షరాల మూడు లక్షల డెబ్బై తొమ్మిది వేల రెండు వందల ఎనభై ఏడు రూపాయల ముప్పై నాలుగు పైసలు మాత్రమే) + 14.04.2024** నుండి వర్తించని వడ్డీ ఇతర చార్జీలు మొ॥నవి **బ్యాంక్ ఆఫ్ బరోడా, మందడం బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీత, హామీదారు, తనఖాదారులకు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు
షెడ్యూలు-ఎ : గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్, మందడం సబ్-రిజిస్ట్రేషన్, అమరావతి రాజధాని నగరం పరిధిలో, మందడం ఏరియా, సర్వే నెం.లు. 190,191,193 & 196లో విస్తీర్ణం ఎ.3.75 సెంట్లు భూమి.
షెడ్యూలు-బి : అమరావతి రాజధాని నగరం, మందడం, PMAY(U)-YSR జగనన్న నగర్, సర్వే నెం.190,191,193 & 196 లో ఉన్న మొత్తం బ్లాక్ ఏరియా భూమి 608 చ.గ.ల విస్తీర్ణంలో 19 చ.గ.ల అవిభాజ్యపు వాటా గల 3వ అంతస్తులో బ్లాక్ B2 నందు ఫ్లాట్ నెం. TF1, లో 365 చ.అ.ల (సాధారణ ప్రాంతాలలో దామాషా వాటాతో సహా).
బ్లాక్ హద్దులు : ఉత్తరం : ఓపెన్ స్పేస్, **తూర్పు :** బ్లాక్ నెం.బి3, **దక్షిణం :** 9.00 మీ॥ల వెడల్పు గల రోడ్, **పడమర :** ఓపెన్ స్పేస్.
3వ అంతస్తు, ఫ్లాట్ నెం.TF1 నకు హద్దులు : ఉత్తరం : ఫ్లాట్ నెం.TF-2, **తూర్పు :** ఫ్లాట్ నెం.TF-8, **దక్షిణం :** 9.00 మీ॥ల వెడల్పు గల రోడ్, **పడమర :** ఓపెన్ స్పేస్.

తేది : 24.07.2024 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : మందడం — బ్యాంక్ ఆఫ్ బరోడా

ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

స్వాధీనతా ప్రకటన (అనుబంధం - 4 - స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ యొక్క రూల్ 8(1) క్రింద. సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద ఏర్పాటు కాబడినది. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద **గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/రుణగ్రహీతల యొక్క న్యాయవారసులకు డిమాండు నోటీసు జారీచేసి సదరు నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు చెల్లించు వరకు తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు మొదలగు వాటిని తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది.రుణగ్రహీతలు దిగువ పేర్కొనబడిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఇందుమూలముగా ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రాజికమునకు తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 9తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ పేర్కొనబడిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నారు.** ప్రత్యేకించి పైన పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదు మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరిపితే లోన్ రీకాల్ డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన మొత్తంతో పాటు తదుపరి వడ్డీలు, ఛార్జీలు మొదలగు వారి కొరకు బ్యాంకు యొక్క ఛార్జీకి లోబడి ఉండగలదు. హామీగల ఆస్తులు విడిపించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి SARFAESI చట్టం 2002 యొక్క సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) నిబంధనలను రుణగ్రహీతల దృష్టికి తీసుకురావడం జరుగుచున్నది.

1	**రుణగ్రహీతల వివరాలు:** ప్రభాకర్ అడుసుమిల్లి S/o A. సత్యనారాయణ. **డిమాండ్ నోటీసు తేదీ:** 15-05-2023 **బకాయి మొత్తం: రూ.31,52,212/- ది 30.04.2023 నాటికి** మెయిన్ బ్రాంచ్‌లోని **లోన్ నంబర్ 012213008774**లో పూర్తిగా చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్:** ప్రభాకర్ అడుసుమిల్లి, డోర్ నెం.42-4-126B, RRWA322, వెంకటేశ్వరస్వామి గుడి వీధి, రామకృష్ణాపురం, విజయవాడ. అసెస్‌మెంట్ నెం.1073065658 & ఎం.వార్డ్ నం.21/4ఎ. డాక్ నెం.2368/2000తో విజయవాడ సబ్ రిజిస్ట్రీ. ఆస్తి 120.46 చ.గజాల సర్వే నెం.44/17. RCC భవనాన్ని కలిగి ఉంటుంది. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- రోడ్డు (17 అడుగులు) దక్షిణం:- సిధార విశాలాక్షి (63.79 అడుగులు) పశ్చిమం:- వంకాయల అన్నపూర్ణమ్మ (17 అడుగులు) ఉత్తరం:- యడవల్లి నాగేశ్వరరావు (63.79 అడుగులు) **స్వాధీనం చేసుకున్న తేదీ: 29-07 -2024.**
2	**రుణగ్రహీతల వివరాలు:1) ప్రధాన రుణగ్రహీత: పరసా యేసు రత్నం,** S/o ఆడమ్. **డిమాండ్ నోటీసు తేదీ:** 01-04-2024 **బకాయి మొత్తం: రూ.25,91,475/-** 31.03.2024 నాటికి తదుపరి వడ్డీతో పాటు మెయిన్ **బ్రాంచ్ నందలి లోన్ నంబర్ 01-2212-001138లో** పూర్తిగా చెల్లించే వరకు తదుపరి వడ్డీతో పాటు. **ఆస్తి వివరణ:- ఆస్తి హోల్డర్: పరసా యేసు రత్నం:** డోర్ నెం. 36-8-36/3, ప్లాట్ నెం.83, వాటర్ ట్యాంక్ దగ్గర, నెహ్రూ నగర్, వుడ్‌పేట, విజయవాడ-520010. సర్వే నెం.NTS-32/A1Aలో 76 చదరపు గజాల ఆస్తి RCC భవనాన్ని కలిగి ఉంది. **అసెస్‌మెంట్ నెం.**1073105539. విజయవాడలోని టీఎస్పీ నెం.78లో తహశీల్దార్‌కు చెందిన పట్టా భూమిని అసైన్డ్ చేశారు. **ఆస్తి సరిహద్దులు:** తూర్పు:- ప్లాట్ నెం.84 (40 అడుగులు) దక్షిణం:- రోడ్డు (17 అడుగులు) పశ్చిమం:- ప్లాట్ నెం.82 (40 అడుగులు) ఉత్తరం:-రోడ్ (17 అడుగులు). **స్వాధీనం చేసుకున్న తేదీ: 29-07 -2024.**

ది.29-07-2024, స్థలం : విజయవాడ — సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

కనువిప్పు కావాలి

ప్రధాని మోడీ అధ్యక్షతన శనివారం జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి ఏకంగా పది మంది ముఖ్యమంత్రులు దూరంగా ఉండటం, వారిలో ఇద్దరు ఎన్‌డిఎ భాగస్వాములు కావడం, వచ్చిన పశ్చిమబెంగాల్ సిఎం మధ్యలోనే వాకౌట్ చేయడం రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షపై నిరసనకు ప్రతిరూపం. దేశ రాజకీయాల్లో ఇదొక సంచలనం. కేంద్రంలో మూడవ సారి మోడీ ఏర్పాటు చేసిన సంకీర్ణ సర్కారు మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసింది. విపక్ష పాలిత రాష్ట్రాలపై తీవ్ర వివక్ష చూపింది. వరుసగా రెండు టర్మ్‌లు బిజెపి స్వంత మెజార్టీతో ప్రభుత్వాన్ని నడిపినప్పుడు ఎలాగైతే రాష్ట్రాల హక్కులను హరించిందో సంకీర్ణంలోనూ అదే బాణీని కొనసాగించింది. తన ప్రభుత్వాన్ని నిలబెట్టిన టిడిపి, జెడియు అధికారంలో ఉన్న ఎ.పి., బీహార్ రాష్ట్రాలకు మాత్రమే కొద్ది మేర నిధులు విదిలించి, అపరిమితమైన హామీలు గుప్పించి, విపక్ష పాలిత రాష్ట్రాలకు పంగనామాలు పెట్టింది. కేంద్రం అవలంబించిన వలపక్షాన్ని నిరసిస్తూ 'ఇండియా' బ్లాక్‌లోని పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, కేరళ, జార్ఖండ్, పంజాబ్, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ సిఎంలు నీతి ఆయోగ్ భేటీని బాయ్‌కాట్ చేశారు. జైలులో ఉండటం వలన ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ సమావేశానికి రాలేదు. రాష్ట్రాల పట్ల కేంద్రం చూపుతున్న వివక్షపై మాట్లాడేందుకు రాగా ఐదు నిమిషాల్లోనే మైక్ కట్ చేశారని బెంగాల్ సిఎం మమత బెనర్జీ వాకౌట్ చేశారు.

ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వంలో కీలక భాగస్వామి, జెడియు చీఫ్, బీహార్ సిఎం నితీష్ కుమార్ సమావేశానికి డుమ్మా కొట్టడంతో దేశ రాజకీయాల్లో మరొకసారి కలకలానికి దారి తీసింది. డిప్యూటీ సిఎంలు ఇద్దరు వచ్చినా నితీష్ గైర్హాజరీపైనే చర్చ. మరో ఎన్‌డిఎ భాగస్వామి పుదుచ్చేరి సిఎం రంగసామి సైతం సమావేశానికి రాలేదు. అసెంబ్లీ సమావేశాల వల్లనే రాలేదంటున్నా అంతగా అతకట్లేదు. అక్కడ అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేది ఈ నెల 31. ఈ పరిణామాలను ఎన్‌డిఎలో పొడసూపిన పొరపొచ్చాలు కావొచ్చున్నది పలువురి భావన. కాగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం (వికసిత్ భారత్) చేయాలన్న లక్ష్య సాధనకై రోడ్ మ్యాప్ రూపకల్పనకు నీతి ఆయోగ్ సమావేశమని కేంద్రం చెబుతోంది. మన దేశం రాష్ట్రాల సమాహారం. అలాంటప్పుడు రాష్ట్రాలను తొక్కేసి దేశాన్ని అభివృద్ధి చేయడం ఎలా సాధ్యమో బిజెపి, మోడీ చెప్పాలి. పేదరిక నిర్మూలన జరక్కుండా వికసిత భారత్ సాధ్యం కాదంటున్న కేంద్రం, రాష్ట్రాలకు నిధులివ్వకుండా పేదరిక నిర్మూలన ఎలా జరుగుతుంది? కేంద్రంలో రెండు టర్మ్‌లు పాలించిన బిజెపి, రాష్ట్రాల హక్కులను హరించింది. రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన నిధులకు కోతలు పెట్టింది. విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్షతో పాటు గవర్నర్లను ఉపయోగించి ఇబ్బంది పెట్టింది. బలహీనమైన రాష్ట్రాలు, బలమైన కేంద్రం అన్నది ఆది నుంచీ ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. దాన్నే బిజెపి తూచ అమలు చేస్తోంది.

అభివృద్ధిలో వెనకబడ్డ, వివక్షకు గురైన ప్రాంతాలతో పాటు క్రమబద్ధమైన దేశాభివృద్ధి కోసం ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 2014లో బిజెపి సర్కారు రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్‌ను ప్రతిష్టించింది. నీతి ఆయోగ్ నయా-ఉదారవాద విధానాలను, కార్పొరేట్ అనుకూల చర్యలు, చట్టాల రూపకల్పనకే ఈ కాలంలో పని చేసింది. వికసిత్ భారత్‌కూ అదే పంథాను ప్రతిపాదించింది. రాష్ట్రాలు, ముఖ్యంగా వెనకబడ్డ రాష్ట్రాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) కోసం పోటీ పడాలని, పెట్టుబడులను ఆకర్షించేందుకు తగిన విధానాలు రూపొందించుకోవాలని దిశా నిర్దేశం చేసింది. ప్రోత్సాహకాలతో పాటు శాంతి భద్రతలను ప్రముఖంగా ప్రస్తావించింది. అంటే ప్రజల ప్రజాతంత్ర హక్కులను అణచివేయాలని చెప్పకనే చెప్పింది. విచిత్రమేమంటే కేంద్రం రాష్ట్రాలకు నిధులివ్వదు. కానీ రాష్ట్రం జిల్లాలకు నిధులివ్వాలని ఉచిత సలహా ఇచ్చింది. నీతి ఆయోగ్‌లో పాల్గొన్న ఎ.పి. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం తమకు కొత్తగా ఏమీ ఇవ్వలేదన్నారంటే భేటీ వలన రాష్ట్రాలకు ఒరిగేమీ లేదని అర్థమవుతుంది. నీతి ఆయోగ్ భేటీకి సిఎంలు రాకపోవడం వలన ఆయా రాష్ట్రాలకే నష్టమన్న నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రమణ్యం వ్యాఖ్య సిఎంలను బెదిరించడమే అవుతుంది. సిఎంల నిరసనతోనైనా ఎన్‌డిఎ ప్రభుత్వం రాష్ట్రాల పట్ల వివక్షను విడనాడి రాజ్యాంగ బద్ధంగా నడుచుకునేనా?

మహనీయుల మాట

మతతత్వాన్ని మట్టుపెట్టే పని...
ముస్లింలు, సిక్కులు, హిందువులు, క్రైస్తవులు తదితరులందరిదీ. భారతీయులందరిదీ.
దీనికోసం వారంతా మతతత్వ దృక్పథాన్ని అధిగమించి, నిజమైన జాతీయవాద మనస్తత్వాన్ని అలవరచుకోవాలి.

- సుభాష్ చంద్రబోస్

2024-25 బడ్జెట్ - భయపెడుతున్న మొండితనం

గత సంవత్సరాలలో ఏ వ్యూహాన్ని అనుసరిస్తూ వచ్చారో ఇప్పుడూ అదే అనుసరించారు. ఆ వ్యూహం ఏమంటే: అదనపు ఆర్థిక వనరులను సమీకరించడానికి ఎటువంటి ప్రయత్నాలూ చేయకపోవడం, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయాన్ని (ఇందులో ఎక్కువ భాగం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వచ్చే లాభాలు ఉంటాయి), పెట్టుబడి వ్యయాన్ని పెంచడానికి కొంత వరకు ఉపయోగించడం (ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన రంగంలో), కొన్ని పద్దుల కింద సంక్షేమ వ్యయం గనుక పెరిగితే తక్కిన పద్దుల కింద సంక్షేమ వ్యయానికి కోత పెట్టడం, బడా పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా బడ్జెట్‌లో వారికి కేటాయింపులు పెంచడం.

ఒక పక్కన భారీ నిరుద్యోగం ప్రజల్ని, ప్రత్యేకించి దేశంలోని యువతను పీడిస్తోంది. అదిగాక ఆహార వస్తువుల ధరల్లో పెద్దఎత్తున ద్రవ్యోల్బణం విడవకుండా వెన్నాడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్యం గతంలో ఎన్నడూ మనం చూడనంత తీవ్ర స్థాయిలో ఉంది. వీటన్నింటికీ తోడు చిన్న ఉత్పత్తుల రంగంలో సంక్షోభం నెలకొంది. ఇక ఆదాయాల్లో, సంపదలో వ్యత్యాసాలు ఎంత తీవ్ర స్థాయికి చేరుకున్నాయంటే మొత్తం ప్రపంచమంతా దాని గురించి మాట్లాడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రవేశపెట్టే బడ్జెట్ తక్షణం జరూరుగా చేపట్టవలసిన చర్యలను ప్రతిపాదిస్తుందని, ఈ సమస్యలను ఎదుర్కోడానికి కొంత గుండె ధైర్యాన్ని ప్రదర్శిస్తుందని ఎవరైనా ఆశిస్తారు. కాని జులై 23న పార్లమెంటులో ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇవేమీ కనిపించవు. మొత్తంగా స్థూల డిమాండ్‌ను పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచి తద్వారా నిరుద్యోగాన్ని కొంత మేరకు తగ్గించే ప్రతిపాదన గాని, లేదా ప్రత్యేకంగా ఉద్యోగాల కల్పనకు దారి తీసే పథకాలు గాని ఏవీ లేవు. విద్య, వైద్య రంగాలకు జిడిపిలో తగు మోతాదులో కేటాయింపులు పెంచలేదు. సంక్షేమ పథకాలకు కేటాయింపులు పెంచలేదు సరికదా, తగ్గించారు. పోనీ, ఆర్థిక వనరుల కొరత కారణంగా ఇలా చేయవలసి వచ్చిందా అంటే అటువంటిదేమీ లేదు. మొత్తంగా ప్రభుత్వం వైపు నుండి ఒక ప్రయత్నమే ఏదీ లేకుండా పోయింది.



ప్రభాత్ పట్నాయక్

గత సంవత్సరాలలో ఏ వ్యూహాన్ని అనుసరిస్తూ వచ్చారో ఇప్పుడూ అదే అనుసరించారు. ఆ వ్యూహం ఏమంటే: అదనపు ఆర్థిక వనరులను సమీకరించడానికి ఎటువంటి ప్రయత్నాలూ చేయకపోవడం, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కాకుండా ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయాన్ని (ఇందులో ఎక్కువ భాగం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కు వచ్చే లాభాలు ఉంటాయి), పెట్టుబడి వ్యయాన్ని పెంచడానికి కొంతవరకు ఉపయోగించడం (ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన రంగంలో), కొన్ని పద్దుల కింద సంక్షేమ వ్యయం గనుక పెరిగితే తక్కిన పద్దుల కింద సంక్షేమ వ్యయానికి కోత పెట్టడం, బడా పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా బడ్జెట్‌లో వారికి కేటాయింపులు పెంచడం.

వీటన్నింటినీ నేను వరుసగా వివరిస్తాను. 2023-24 బడ్జెట్ (సవరించిన అంచనాలు)తో పోల్చితే 2024-25 బడ్జెట్ (బడ్జెట్ అంచనాలు)లో రాష్ట్రాలకు బదలాయించే భాగంతో సహా మొత్తం ప్రభుత్వ వ్యయం 7.35 శాతం పెరుగుతుందని ప్రతిపాదించారు. అంటే జిడిపిలో కేంద్ర ప్రభుత్వ వ్యయం వాటా తగ్గుతుందన్నమాట. ఇప్పుడు ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రభుత్వ వ్యయాన్ని బాగా పెంచాలి. కాని దానికి పూర్తి వ్యతిరేక దిశలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించారు. ఈ వికృత చర్యకు కారణం ఆర్థిక వనరుల కొరత ఉండడం ఎంత మాత్రమూ కాదు. వాస్తవానికి జిడిపి తో పోల్చినప్పుడు పన్ను నిష్పత్తి 2021-22 లో 11.5 శాతం, 2023-24లో 11.7 శాతం, ఇప్పుడు 2024-25లో 11.8 శాతంగా ఉంది. అంటే పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలనే ప్రయత్నం ఈ ప్రభుత్వం వైపు నుండి ఏ మాత్రమూ లేదు. ఇక పన్నుల ద్వారా కాకుండా ఇతరత్రా వచ్చే ఆదాయం 2023-24తో పోల్చితే 2024-25లో 36 శాతం పెరుగుదల నమోదు చేస్తుందని అంచనా వేశారు. అందులో డివిడెండ్ల ద్వారా, లాభాల ద్వారా (ముఖ్యంగా రిజర్వు బ్యాంకు లాభాల ద్వారా) లభించేది 70 శాతం పెరుగుదల నమోదు చేయనుంది.

ఇక ఖర్చు వైపు చూద్దాం. ప్రభుత్వ వ్యయం మొత్తంగా 7.35 శాతం మాత్రమే పెరుగుతుంది. అందులో పెట్టుబడి వ్యయంలో (దీనిలో రాష్ట్రాలకు ప్రాజెక్టు పెట్టుబడుల నిమిత్తం బదలాయించేది కూడా ఉంటుంది) మాత్రం 17 శాతం వృద్ధి ఉండనుంది. ఇది పైకి చూడడానికి మంచి పరిణామంగానే కనిపిస్తుంది. కాని, ఈ ప్రాజెక్టులు శ్రామిక ప్రజల జీవితాల మీద ఎటువంటి ప్రభావాన్నీ చూపించలేవు. పైగా దానిలో విదేశాల నుండి దిగుమతి చేసుకునే సరుకులు, సేవల నిమిత్తం విదేశాలకు తరలిపోయే భాగం ఎక్కువగా ఉంటుంది. అందుచేత దేశీయంగా ఉద్యోగాలను కల్పించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. పైగా, పెట్టుబడి వ్యయం పెరిగినందున, తక్కిన ప్రభుత్వ వ్యయం బాగా తగ్గిపోతుంది. దాని ఫలితంగా దేశీయంగా డిమాండ్ తగ్గుతుంది. అది నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది.

తన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిరుద్యోగాన్ని గురించి ప్రస్తావించారు. కాని అందుకు సూచించిన పరిష్కారం చూస్తే ఆమెకు ఉన్న అవగాహనా రాహిత్యం బైటపడుతుంది. ఉద్యోగాల కల్పనకోసం ఆమె మూడు పథకాలను ప్రతిపాదించారు. ఈ పథకాల ద్వారా ఉద్యోగులకు, యజమానులకు సొమ్మును చెల్లిస్తారు. కొత్త ఉద్యోగాల కల్పనను ప్రోత్సహించేందుకు ఈ చెల్లింపులు చేస్తారు. ప్రధానంగా ఈ స్కీములు సంఘటిత రంగానికి వర్తిస్తాయి. అందులో ఉద్యోగులకు చెల్లింపుల కోసం కేటాయించినప్పటికీ, ఆ మేరకు యజమానులు ఉద్యోగుల వేతనాలను తగ్గించే అవకాశం ఉంది. ఆ విధంగా యజమానులు ప్రయోజనం పొందుతారు. ఇది కాకుండా నైపుణ్యం పెంపొందించేందుకు ఒక పథకాన్ని ఆమె ప్రతిపాదించారు. దాని వలన కొత్త ఉద్యోగాలు లభిస్తాయని ఆమె చెప్పుకొచ్చారు.

ఈ నిధుల కేటాయింపు పథకం వెనుక ఉన్న అంతస్సూత్రం ఏమంటే ఉద్యోగులకు చెల్లించే వేతనాలు తక్కువగా ఉంటే ఎక్కువ ఉద్యోగాలు ఏర్పడతాయి అని. ఇది బూర్జువా ఆర్థిక శాస్త్రానికి అత్యంత ఇష్టమైన సూత్రం. కాని అది ఎంత మాత్రమూ సరైనది కాదు. యజమానులు చెల్లించవలసిన జీతాల వాటా తగ్గితే ఆ తగ్గిన మొత్తాన్ని యజమానులు తమ జేబులో వేసుకుంటారే తప్ప కొత్త ఉద్యోగాలను కల్పించరు. నైపుణ్యాన్ని కల్పించే పథకాల వలన కొత్త ఉద్యోగాలు వస్తాయన్నదీ ఆ బూర్జువా ఆర్థికవేత్తల సిద్ధాంతమే. దాని ప్రకారం, మార్కెట్‌లో స్థూల డిమాండ్ ఎప్పుడూ ఒకే తీరుగా ఉంటుంది. ఉన్న ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలు ఉన్నవారు లేకుంటే అప్పుడు ఉద్యోగాలు నిండవు. ఉన్న నిరుద్యోగులకు సరిపడా ఉద్యోగాలైతే ఉంటాయి కాని, వారికి తగిన నైపుణ్యం లేనందువల్లే ఆ ఉద్యోగాలు నిండడం లేదు. - ఇదీ ఆ సిద్ధాంతం.

ఈ రెండు సిద్ధాంతాలూ పూర్తిగా తప్పు. సరుకులను ఉత్పత్తి చేసిన మేరకు వాటికి డిమాండ్ ఎప్పుడూ ఉండనే వుంటుంది అన్నదే ఆ సిద్ధాంతం (దీనినే సే సూత్రం అంటారు). ఈ వాదనను మార్క్స్ పూర్తిగా వ్యతిరేకించాడు. మళ్ళీ 75 సంవత్సరాల తర్వాత కీన్స్ కూడా ఈ సూత్రాన్ని వ్యతిరేకించాడు. అంతదాకా ఈ సే సూత్రాన్ని చాలా బలంగా నమ్ముతూ వచ్చారు. ఎఫ్‌డి రూజ్‌వెల్ట్ కన్నా ముందు అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన హెర్బర్ట్ హూవర్ మహా మాంద్యం కాలంలో వేతనాలను తగ్గిస్తే దానివలన అదనపు ఉద్యోగాలు కలుగుతాయని నమ్మి ఆ పనికి పూనుకున్నాడు. ఐతే కొత్త ఉద్యోగాలు ఏవీ ఏర్పడలేదు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలు వంద సంవత్సరాల క్రితపు ఆ ఆలోచనలను దాటి ముందుకు పోలేకపోతున్నాయి. నిరుద్యోగాన్ని పరిష్కరించడంలో విఫలమైన ఆ ఆలోచనలనే పట్టుకుని వేలాడుతున్నాయి.

ఆర్థిక వ్యవస్థను పుంజుకునేలా చేయడానికి పెట్టుబడిదారులకు ధనాన్ని బదలాయించడం నిష్ప్రయోజనం అని అధికారిక ప్రకటనలలో అరుదుగా వస్తుంది. ఆర్థిక సర్వే అటువంటి ఒక అరుదైన సందర్భం. ఆ సర్వే కూడా పెట్టుబడిదారులు తమకు ధనం బదలాయింపు జరిగినా, దానిని ఎందుకు పెట్టుబడిగా పెట్టడం లేదు అన్ని ప్రశ్నించదు. అలా పెట్టుబడి పెట్టడానికి ఆర్థికంగా పరిస్థితులు బాగానే ఉన్నా, వాళ్ళు పెట్టుబడులు పెట్టకపోవడం కేవలం వారి నైతిక వైఫల్యం మాత్రమేనని భావిస్తుంది. తమకు ఎక్కువగా లాభాలు వచ్చాయి కాబట్టి వాళ్ళు ఎక్కువగా పెట్టుబడులు మళ్ళీ పెడతారు అనుకోవడం తప్పు. మార్కెట్‌లో డిమాండ్ పెరగకుండా ఉండిపోతే వాళ్ళు పెట్టిన అదనపు పెట్టుబడి వలన ఏమి ఉపయోగం? అటువంటి సందర్భాలలో పెట్టుబడిదారులు తమ వద్ద నున్న ధనాన్ని పెట్టుబడి పెట్టడానికి కాకుండా రియల్ ఎస్టేట్ కొనడానికో, షేర్లు కొనడానికో ఖర్చు చేస్తారు. తద్వారా మరింత లాభాన్ని పొందవచ్చునని భావిస్తారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు పూర్తిగా డొల్ల విధానాలు. వాటిని ఐఎంఎఫ్. ప్రపంచబ్యాంకు పదే పదే ప్రచారం చేస్తున్నాయి కనుక వీళ్ళు ఇక్కడ వాటిని అమలు చేసేస్తున్నారు.

ప్రభుత్వం ఉద్దేశ్యం ఏమిటో ఉపాధి హామీ పథకానికి చేసిన కేటాయింపులు చూస్తే తెలుస్తుంది. దానికి రు.86.000 కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాది కూడా ఇదే మొత్తాన్ని కేటాయించారు. పెరిగిన ధరలతో పోల్చినప్పుడు వాస్తవంగా కేటాయింపులు తగ్గాయన్నమాట. ఆ ఉపాధి పనులకు డిమాండ్ పెరిగితే అప్పుడు అదనంగా కేటాయిస్తామని ఎప్పుడూ చెప్పేదే ఇప్పుడు కూడా ప్రభుత్వం చెప్తుంది. కాని ఉపాధి పనులకు వేతనాలు వెంటనే చెల్లించకపోతే ఆ పనులకు అదనపు డిమాండ్ ఎలా పెరుగుతుంది? బడ్జెట్‌లో తక్కువగా కేటాయించినప్పుడు సకాలంలో వేతనాలు చెల్లించడం ఏవిధంగా సాధ్యపడుతుంది? పైగా గతేడాది చాలామందిని ఉపాధి హామీ పథకం పరిధి నుండి మినహాయించారు (పశ్చిమ బెంగాల్‌లో మాదిరిగా). అందువలన ఉపాధి హామీ పథకానికి చేసిన వ్యయం గతేడాది బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది కూడా ఇదే జరుగుతుంది. ఇది క్షమించరాని నేరం.

ఇక వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చే పెన్షన్లను చూస్తే గతేడాది ఎంత కేటాయించారో ఈ ఏడాదీ అదే మొత్తాన్ని కేటాయించారు. అసలు ఈ పథకాల కింద ఇచ్చే మొత్తమే చాలా తక్కువ. పైగా కేటాయింపులు పెంచలేదు. అంటే ధరల పెరుగుదలను లెక్కలోకి తీసుకుంటే వాస్తవ కేటాయింపులు తగ్గినట్టే. ఇక విద్యకు కేటాయింపుల్లో 7.8 శాతం పెరుగుదల చూపారు. వైద్యానికి దాదాపు ఎటువంటి పెరుగుదలా లేదు. జిడిపితో పోల్చినప్పుడు ఈ రెండు రంగాలకూ తగు విధంగా పెరుగుదల ఉండాలి. కాని అలా చేయలేదు. అంటే సాపేక్షంగా కేటాయింపులు తగ్గిపోయినట్టే. నిజానికి ఈ రెండు రంగాలలోనూ గతేడాది చేసిన కేటాయింపుల మేరకు కూడా ఖర్చు చేయలేదు. ఇది తీవ్రంగా పరిగణించవలసిన విషయం. కాని గతేడాది ఖర్చు కాలేదు అన్న సాకు చూపించి ఈ ఏడాది కేటాయింపుల్లోనే కోతలు పెట్టడం జరిగింది.

2023-24లో ఆహార సబ్సిడీ కింద రూ.2.12 లక్షల కోట్లు కేటాయించారు. ఈ ఖర్చు 2024-25లో రూ.2.05 లక్షల కోట్లకు తగ్గిపోయింది. ఇంకోపక్క రైతులకు ప్రకటించిన మద్దతు ధరలు చాలా హీనంగా ఉంటున్నాయి. అంటే ఆ రైతులు తాము మద్దతు ధరలను కోల్పోతూ మరోపక్క ఆహార సబ్సిడీ భారాన్ని కొంతవరకూ మోస్తున్నారన్నమాట. ఇక ఆంధ్ర, బీహార్ ప్రభుత్వాలకు చేసే బదలాయింపులు ఎక్కువగా ఉన్నందువలన ఆ మేరకు తక్కిన రాష్ట్రాల మీద ఆ భారం పడుతుందన్నమాట.

ఈ దేశ ప్రజానీకం ఎదుర్కొంటున్న తీవ్ర, తక్షణ సమస్యల గురించి ఈ ప్రభుత్వానికి ఏమీ పట్టడం లేదని ఈ బడ్జెట్ బట్టి అర్థం అవుతుంది. ఈ దేశ ఆర్థిక స్థితి అంతా బాగానే ఉన్నట్టు, తక్షణమే స్పందించి పరిష్కరించవలసిన సమస్యలేవీ లేనే లేనట్టు ఎన్డీయే ప్రభుత్వం నటిస్తోంది. ఈ మొండితనం ఆశ్చర్యం కలిగిస్తోంది.

(స్వేచ్ఛానుసరణ)

చర్చ

వికలాంగులకు బాసటగా నిలవాల్సిన సమయం

సివిల్ సర్వీసులలో వికలాంగుల రిజర్వేషన్‌పై సీనియర్ ఐఎఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా దుమారాన్ని రేపుతున్నాయి. అఖిల భారత సర్వీసులలో వికలాంగుల కోటాపై ఆమె లేవనెత్తిన ప్రశ్నలు హద్దు మీరాయంటూ ఒక పార్లమెంటు సభ్యురాలు వ్యాఖ్యానించారు. శిక్షణలో ఉన్న ఒక ఐఎఎస్ అధికారిణి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించి వికలాంగుల కోటాలో ఐఎఎస్‌కు ఎంపిక అయ్యారనే అభియోగాలపై యుపిఎస్‌సి చర్యలకు ఉపక్రమించింది. ఎంతో పారదర్శకంగా ఏ విధమైన పొరపాట్లకు ఆస్కారమే ఉండదని భావించే అఖిల భారత సర్వీసుల ఎంపికలోని డొల్లతనం ఈ సందర్భంగా బయటపడటం సగటు భారతీయుడిని ఉలిక్కిపడేటట్లు చేసింది. అంతేకాక ఎంపిక సందర్భంలో అనేక వడపోతల ద్వారా ఒక సమర్థవంతమైన, వ్యక్తిత్వ వికాసంతో కూడిన అభ్యర్థులను ఎంపిక చేసి దేశ పాలనా వ్యవస్థలో వారిని భాగస్వాములను చేయడం లక్ష్యంగా యుపిఎస్‌సి ఏర్పాటయింది. కానీ పూజా కేత్కర్ వంటి అధికార దుర్వినియోగానికి పాల్పడే వ్యక్తిని, నేరారోపణలు ఎదుర్కొంటున్న కుటుంబ నేపథ్యం ఉన్న ఒక అభ్యర్థి ఎంపిక కావడం అనూహ్యం. శిక్షణా కాలంలోనే ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడడంతో ఆమె వ్యక్తిత్వంపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. కారు, అధికారిక వసతులు వంటి అప్రధాన అంశాలకు ప్రాధాన్యమిచ్చే స్వార్థపరులకు ఈ వ్యవస్థ ఎలా అవకాశం కల్పించిందనేది ప్రశ్న. ఆమె తప్పుడు ధృవీకరణ పత్రాన్ని సమర్పించడమే కాక తన పేరు, తల్లిదండ్రుల పేర్లు, సంతకం ఈ-మెయిల్ ఐ.డి, మొబైల్ నెంబర్, చిరునామా పత్రాలను సైతం మోసపూరితంగా సమర్పించినట్లు నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంలో



ఎవరిది తప్పుగా కనిపిస్తున్నదో స్మితా సబర్వాల్ చెప్పాల్సి ఉంటుంది.

రోగం ఒకటైతే మందు మరొకటి అన్నట్లుగా తప్పు చేసిన పూజ కేత్కర్‌ని, లోపభూయిష్టమైన ఎంపిక విధానం ద్వారా ఆమెను ఆ స్థాయి వరకు తీసుకు వచ్చిన నియామక సంస్థను నిందించడం మానేసి భారత రాజ్యాంగం కల్పించిన వెసులుబాటు ద్వారా వికలాంగులు పొందుతున్న రిజర్వేషన్లపై ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం సమస్యను తప్పుదారి పట్టించే ప్రయత్నమే అవుతుంది. పైగా బాధ్యతాయుతమైన కేంద్ర సర్వీసులకు చెందిన అధికారిణిగా భారత రాజ్యాంగాన్ని, ప్రభుత్వ నిర్ణయాలను గౌరవించవలసిన అవసరం ఆమెకు ఉంటుంది.

రోగం ఒకటైతే మందు మరొకటి అన్నట్లుగా తప్పు చేసిన పూజ కేత్కర్‌ని, లోపభూయిష్టమైన ఎంపిక విధానం ద్వారా ఆమెను ఆ స్థాయి వరకు తీసుకు వచ్చిన నియామక సంస్థను నిందించడం మానేసి భారత రాజ్యాంగం కల్పించిన వెసులుబాటు ద్వారా వికలాంగులు పొందుతున్న రిజర్వేషన్లపై ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిణి ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం సమస్యను తప్పుదారి పట్టించే ప్రయత్నమే కాగలదు. పైగా బాధ్యతాయుతమైన కేంద్ర సర్వీసులకు చెందిన అధికారిణిగా భారత రాజ్యాంగాన్ని, ప్రభుత్వ నిర్ణయాలను గౌరవించవలసిన అవసరం ఆమెకు ఉంటుంది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 16(4) ద్వారా కేంద్ర ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లనే ఆమె ప్రశ్నించదలిచారా? ఈ రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాలు ఇచ్చిన పలు తీర్పులను సైతం ఆమె పరిశీలించవలసిన అవసరం ఉన్నది. ట్విట్టర్ వేదికగా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలిచారు?

వికలాంగుల కోటా ద్వారా ఎంపికైన సమర్థులైన అధికారులు ఎందరో ఉన్నారు. ఆ మాట కొస్తే చక్కటి శరీర దారుఢ్యం ఉన్న అధికారులు అందరూ సమర్థంగా పని చేస్తున్నారా? అనుక్షణం మానసిక వేదనకు, సామాజికంగా అసమానతలను, ఇబ్బందులను ఎదుర్కొనడం, విధిని ఎదిరించి నిరంతర శ్రమతో, కృషితో, పట్టుదలతో సివిల్ సర్వీసుల స్థాయికి ఎదిగిన వికలాంగులైన అధికారులలో మరింత కష్టపడి పని చేయాలనే తపన ఉంటుంది. అలాంటి అనేక ఉదాహరణలు కూడా మనం చూశాం.

మన తెలుగు తేజం బాలలత వైకల్యాన్ని అధిగమించి సివిల్ సర్వీసులకు ఎంపిక కావడమే కాక ఇప్పుడు ఎందరో ఔత్సాహికులకు శిక్షణనిచ్చి సివిల్ సర్వీసులకు ఎంపిక అయ్యేందుకు తన మేధను ఉపయోగిస్తున్నారు.

స్మిత సబర్వాల్ ఒక మంచి అధికారిణి. గతంలో ఆమె పని చేసిన చాలా చోట్ల సమర్థవంతంగా విధులు నిర్వహించారనే పేరు ఉన్నది. అతి చిన్న వయసులో సివిల్ సర్వీసులకు ఎంపిక కావడం ద్వారా సివిల్ ఆశావహులకు ఆదర్శప్రాయురాలిగా నిలుస్తారు. ప్రజల ఆశలకు, అవసరాలకు తగినట్లుగా పని చేసి మంచి గుర్తింపు పొందారు. అటువంటి వ్యక్తి ఇటువంటి వ్యాఖ్యలు చేయడంతో ఆమెను అభిమానించేవారు సైతం ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్లను వ్యతిరేకించే కొందరు ఆమెను సమర్థించడం కూడా మనం చూస్తున్నాం. కానీ ఆమె కేంద్ర సర్వీసుల అధికారిగా ప్రభుత్వంలో భాగస్వామి. అంతేకాదు, రాజ్యాంగ పరిరక్షకురాలు కూడా. ఆమె వ్యాఖ్యలను వ్యక్తిగత వ్యాఖ్యలుగా పరిగణించలేం. వైకల్యాన్ని ఎదుర్కొంటూ, ఆత్మవిశ్వాసంతో ఆటంకాలను అధిగమించి, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ...ఈ వ్యాఖ్యల పట్ల ఆవేదన చెందుతున్న వికలాంగులకు దేశం యావత్తు బాసటగా నిలవాల్సిన అవసరం ఉన్నది.

- ఎన్ స్టాలిన్ బాబు,
సెల్ : 8374669988

అభిప్రాయం

సైబర్ మోసాలు అప్రమత్తత

ఆంధ్రాలో 'అమ్మ ఒడి' పథకం ఉపయో గించుకోలేని వారికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి...ఇప్పుడు 'తల్లికి వందనం' పథకంలో పాత బకాయిలు వస్తాయంటూ...అకౌంట్ నెంబరు, పాన్ కార్డు వివరాలు, తెలుసుకుని మోసం చేశారు. తెలంగాణలో ప్రభుత్వం రైతు రుణమాఫీ' ప్రవేశ పెట్టి ఈ నెల 18 నుండి లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేసింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు...మీ అకౌంట్లో డబ్బులు వేస్తామని రైతుల మొబైల్‌కి సంక్షిప్త సందేశాలు, లింక్ పంపి వెయ్యి రూపాయలు కట్టమంటూ మోసం చేశారు.

సెల్ ఫోన్ల సంఖ్యతో పాటు వాటి ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల్లో ఆర్థిక నేరాల పెరుగుదల ఈ ఏడాది 47 శాతం నమోదైందని ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సెల్ ఫోన్ల ఆధారంగా ఆర్థిక లావాదేవీలు పెరుగుతుండటంతో నేరాలూ అదే స్థాయిలో ఎక్కువవుతున్నాయి.

ఇటీవల అకౌంట్ టేకోవర్‌కు సంబంధించిన నేరాలే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ సైబర్ నేరగాళ్ల వ్యాపార లావాదేవీలు జరిపే వారి ఈ-మెయిళ్లను హ్యాక్ చేస్తారు. అన్ సెక్యూర్డ్ ఈ-మెయిల్ ఐడీల లావాదేవీలను కొంత కాలం పరిశీలిస్తారు. అదును చూసుకుని నగదు చెల్లించాల్సిన వ్యక్తికి, నగదు తీసుకునే వ్యక్తిలా మెయిల్ పంపిస్తారు. బ్యాంక్ ఖాతా మారిందంటూ తమ ఖాతాను మెయిల్‌లో పొందుపరుస్తారు. దీంతో చెల్లింపులు సైబర్ నేరగాడి ఖాతాలోకి వస్తాయి. అందుకే ఖాతాలు మారినట్టుగా సమాచారం వస్తే అవతలి వ్యక్తిని, సంస్థను నేరుగా సంప్రదించి నిర్ధారించుకున్న తర్వాత డిపాజిట్ చేయడం ఉత్తమం. సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్ వంటి చోట్ల ఏదో ఒక సర్వే చేస్తున్నామని నమ్మబలుకుతుంటారు. ఈ-మెయిల్ ఐడీ, సెల్‌ఫోన్ నెంబరు రాసి డబ్బాలో వేస్తే డ్రా తీసి బహుమతి ఇస్తామని కూడా ఆశ పెడతారు. అలాంటి వారికి వివరాలిస్తే ఇబ్బంది. వారి దగ్గర నుంచి ఈ వివరాలను సైబర్ నేరగాళ్లకొనేసి తమ పని కానిస్తున్నారు. మేం ఫలానా బ్యాంకు నుంచి మెయిల్ చేస్తున్నాం. భద్రతా చర్యల్లో భాగంగా అందరి వివరాలు తనిఖీ చేస్తున్నాం. మీ అకౌంట్ నెంబర్, పాస్‌వర్డ్ చెప్తే ఎవరూ ట్యాంపర్ చేయకుండా చర్యలు తీసుకుంటాం... అంటూ వచ్చే ఈ-మెయిల్‌కు స్పందిస్తే ఖాతా ఖాళీ అయిపోయినట్లే.

ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రోజుకు ఇలా కోటికి పైగా ఫిషింగ్ మెయిళ్లు పంపుతున్నట్లు అంచనా. కంప్యూటర్ ద్వారా జరిపే ప్రతి లావాదేవీని తెలుసుకునేందుకు కీ లాగర్స్ అనే సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు. కంప్యూటర్‌ను వినియోగించిన వారు ఏ సమాచారం టైప్ చేశారో ఈ సాఫ్ట్‌వేర్‌తో తెలుసుకోవచ్చు. నెట్ కేఫ్‌ల్లోని సిస్టమ్స్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనితో కంప్యూటర్‌ను వాడుకున్న వారు టైప్ చేసిన సమాచారాన్ని తస్కరించి దుర్వినియోగం చేసేవాళ్లు పెరిగారు. షాపు లేదా పెట్రోల్ బంక్‌కు వెళ్లి, క్రెడిట్ కార్డుతో బిల్లు చెల్లించినపుడు కార్డు చెల్లింపు సమాచారానికి చెందిన ఒక కాపీ వారే ఉంచుకుంటారు. వారి దగ్గర ఉంచుకునే బిల్లు కాపీలో ఉన్న పేరు, కార్డు నెంబర్ ఉంటాయి. కార్డు వెనుక ఉన్న సివివి కోడ్‌ను అవతలి వ్యక్తులు నోట్ చేసుకుంటే మాత్రం...నెట్‌లో మీ ఖాతాతో వారు షాపింగ్ చేసుకోవచ్చు. ఒక్కోసారి స్కిమ్మర్లు వినియోగించి కార్డు డేటాను దొంగిలించి, మరో కార్డు తయారు చేసి జల్సా చేస్తున్నారు. ఈ కేసుల్లో నిందితులను పట్టుకోవడం దాదాపు అసాధ్యం. కాబట్టి, ప్రభుత్వం వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. కళాశాలలు, కార్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి.

సైబర్ నేరాలు భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తాయనడంలో సందేహం లేదు. వీటి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. సైబర్ నేరాలను పసిగట్టి నిందితులను అరెస్టు చేయాలంటే నిఘా వ్యవస్థలను సాంకేతికంగా బలోపేతం చేయాల్సి ఉంది. దేశ రక్షణకు సంబంధించిన ఎప్పటి కప్పుడు సరికొత్త సైబర్ వ్యూహాలను రచించాలి. అప్పుడే దేశానికి, దేశ ప్రజలకు సంపూర్ణ భద్రత లభించే అవకాశముంది. సైబర్ నేరాలను ఎదుర్కొనే విషయంలో అంతర్జాతీయ సమాజం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది.

- డా. ముచ్చుకోట సురేష్ బాబు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ప్రజాశక్తి
www.prajasakti.com

కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.185 లక్షల కోట్లు

- దేశ జిడిపిలో 56.8 శాతం అప్పులే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అప్పులు రూ.185.27 లక్షల కోట్లకు చేరుతుందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంతి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024-25లో కేంద్ర ప్రభుత్వం అప్పులు రూ.185.27 లక్షల కోట్లకు చేరుతుందని, ఇది దేశ జిడిపిలో 56.8 శాతమని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అప్పు

సంవత్సరం	లక్షల కోట్లు	జిడిపి శాతం
2018-19	93.26	49.3
2019-20	105.07	52.3
2020-21	121.86	61.4
2021-22	138.66	58.8
2022-23	156.13	57.9
2023-24	171.78	58.2
2024-25	185.27	56.8

హేమంత్ సోరెన్ బెయిల్‌పై జోక్యానికి సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు మంజూరైన బెయిల్‌పై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సహేతుకమైనదేనని జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పులోని పరిశీలనలు ట్రయల్ కోర్టు విచారణను ప్రభావితం చేయలేవని స్పష్టం చేసింది.

సూరత్ ఎంపి ఏకగ్రీవంపై గుజరాత్ హైకోర్టు సమన్లు

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన బిజెపి ఎంపి ముకేష్ దలాల్‌కు గుజరాత్ హైకోర్టు సమన్లు జారీ చేసింది. ఆయన ఏకగ్రీవ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన రెండు పిటీషన్లపై ఆగస్టు 9లోగా స్పందించాలని సమన్లలో ఆదేశించింది. ఈ విషయాన్ని పిటీషనర్ల తరుపు న్యాయవాది పిఎస్ చంపనేరి మీడియాకు తెలిపారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సూరత్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నిలేష్ కుంబాని నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడం, ఇతర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడం వంటి పరిణామాల తరువాత దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏప్రిల్ 22న ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి కుంబాని నామినేషన్‌ను తిరస్కరిస్తూ సూరత్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయం చట్టబద్ధతను పిటిషనర్లు ప్రశ్నించారు. కుంబాని నామినేషన్ పత్రాలపై ప్రతిపాదకుల సంతకాల్లో తేడాలు ఉన్నాయని నామినేషన్‌ను తిరస్కరించడాన్ని పిటీషన్‌దారులు తప్పుపట్టారు. సంతకాల ధ్రువీకరణ కలెక్టర్ పనికాదని, కాంగ్రెస్ అభ్యర్థికి నియోజకవర్గంలో ప్రతిపాదకుల కొరత లేదని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి, బిసిల రిజర్వేషన్ల కేసులో...

పాట్నా హైకోర్టు ఆదేశాలపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ : ప్రభుత్వోద్యోగాలు, విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లకు సంబంధించి పాట్నా హైకోర్టు తీసుకున్న నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఆయా తరగతుల వారికి 65% రిజర్వేషన్లు కల్పిస్తూ బీహార్ ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిని పాట్నా హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ బీహార్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై స్టే ఇచ్చేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన బెంచ్ సోమవారం నిరాకరించింది. పాట్నా హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన పది పిటిషన్లను పరిశీలించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ అభ్యర్థనపై నోటీసులు జారీ చేసేందుకు నిరాకరిస్తూనే అప్పీళ్లకు అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది. ఆ పిటిషన్లపై తదుపరి విచారణను సెప్టెంబరుకు వాయిదా వేసింది.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరుపతిలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఎస్‌పి క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో వైసిపి నాయకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసే వరకు ప్రతి 15 రోజులకోసారి దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని, రూ.20 వేలు విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని షరతులు విధించింది. ఈ మేరకు జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐదుగురి అరెస్ట్.. ఎంసిడి అధికారి తొలగింపు

న్యూఢిల్లీ : రావూస్ స్టడీ సర్కిల్ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారిని కోర్టు ముందు హాజరుపర్చారు. కరోల్ బాఘ్ జోన్ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయంలో జూనియర్ ఇంజినీర్‌గా ఉన్న వినయ్ మిట్టల్‌పై ఎంసిడి చర్యలు తీసుకుంది. ప్రమాద ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ విధుల నుంచి తొలగించింది.

ఢిల్లీ సివిల్స్ కోచింగ్ సెంటర్ ఘటనపై

పార్లమెంటు దిగ్భ్రాంతి

- శిక్షణ వ్యాపారం అయిపోయింది : రాజ్యసభ ఛైర్మన్
- హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలి : జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని రావూస్ సివిల్స్ కోచింగ్ సెంటర్‌లోకి వచ్చిన వరదతో ముగ్గురు అభ్యర్థులు మరణించిన ఘటనపై పార్లమెంటు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సోమవారం రాజ్యసభలో ఈ ఘటనపై చర్చ జరగ్గా, లోక్‌సభలో వివిధ పార్టీల సభ్యులు ఇదే అంశంపై మాట్లాడారు. లోక్‌సభలో ఈ అంశంపై చర్చకు ప్రతిపక్షాలు వాయిదా తీర్మాన నోటీసులు ఇవ్వగా, వాటిని స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. లోక్‌సభలో ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోచింగ్ సెంటర్ సెల్లార్‌లో నీళ్లు నిండి ముగ్గురు యుపిఎస్‌సి అభ్యర్థులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. 'సరైన ప్లానింగ్ లేని ఇలాంటి భవనాలకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం కచ్చితంగా సంబంధిత అధికారుల బాధ్యతారాహిత్యం. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది..? ప్రభుత్వంపై లేదా..? మరి బాధ్యులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది..? ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏం చేస్తుంది..?' అని అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. ఇది కేవలం ఒక అక్రమ కట్టడానికి సంబంధించిన సమస్య కాదని, ఇలాంటి అక్రమ కట్టడాలు ఢిల్లీలో ఎన్నో ఉన్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో అక్రమ కట్టడాల పేరుతో బిజెపి సర్కారు ఎన్నో బిల్డింగులను బుల్డోజర్లు పెట్టి కూల్చివేయించిందని, మరి ఢిల్లీలో కూడా అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు కేంద్ర సర్కారు బుల్డోజర్‌లను వినియోగిస్తుందా? లేదా..?' అని అఖిలేష్ యాదవ్ నిలదీశారు. బిజెపి ఎంపి బన్సూరీ స్వరాజ్ మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యుపిఎస్‌సి విద్యార్థులు మరణించారని ఆరోపించారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని హోంమంత్రిత్వ శాఖను కోరారు. కాంగ్రెస్ నేత శశిథరూర్ మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజ్యసభలో స్వల్పకాలిక చర్చ

ఘటనపై రాజ్యసభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ.. దేశంలో యువ జనాభా భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. విద్యార్థులకు శిక్షణ ఒక వ్యాపారంగా మారిపోయిందన్నారు. వార్తా పత్రికలు చదివినప్పుడు ఒకటి లేదా రెండు పేజీల్లో ఈ శిక్షణ సంస్థలకు సంబంధించిన ప్రకటనలే కనిపిస్తాయని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభలో మాట్లాడారు. కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఘటనలో ముగ్గురు యుపిఎస్‌సి అభ్యర్థులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని అన్నారు. ఈ ఘటనలో అధికారుల నిర్లక్ష్యం ఉందని, జవాబుదారీతనం నెలకొనేలా చూస్తే ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటం తమ బాధ్యత అని అన్నారు. వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి, బిఆర్‌ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర తదితరులు మాట్లాడారు.

హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలి : జాన్ బ్రిట్టాస్

ఢిల్లీలో గందరగోళం, విషాదాలకు బిజెపి, కేంద్ర ప్రభుత్వాలే ప్రధాన కారణమని జాన్ బ్రిట్టాస్ అన్నారు. ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీతో సహా అన్ని ఏజెన్సీలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయని అన్నారు. వందలాది శిక్షణ కేంద్రాల్లో కేవలం 67 కేంద్రాలకు మాత్రమే ఎన్‌ఓసి ఉందని, ఢిల్లీకి నిజమైన 'అధికారం' హోంమంత్రి అమిత్ షాదేనని పేర్కొన్నారు. బిల్లు ద్వారా ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కేంద్రం లాక్కుందని విమర్శించారు. జవాబుదారీతనం లేకుండా కేంద్రం అధికారాన్ని లాక్కుంటోందని పేర్కొన్నారు. ఢిల్లీ దుర్ఘటనపై అమిత్ షా సమాధానం చెప్పాలన్నారు. దేశంలోని శిక్షణా కేంద్రాలు కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయని, బిజెపి వారితో ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయిస్తోందని విమర్శించారు. విద్య వ్యాపారీకరణ, కేంద్రీకరణ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుందని అన్నారు. రాష్ట్ర సబ్జెక్టుగా ఉన్న విద్యను అత్యవసర పరిస్థితిలో ఉమ్మడి జాబితాలో చేర్చారని, ఎమర్జెన్సీకి బిజెపి వ్యతిరేకమైతే, విద్యపై పూర్తి అధికారాన్ని రాష్ట్రాలకు తిరిగి ఇవ్వాలని బ్రిట్టాస్ డిమాండ్ చేశారు.

సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర ప్రారంభం

- ద్వంద్వ వైఖరి అవలంభిస్తే బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు కొంగు బంగారమైన సింగరేణి గనులను ప్రయివేటీకరిస్తే లక్షలాది మంది బతుకులు ఆగమవుతాయని, మన పిల్లల భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో కోల్‌బెల్ట్ ఏరియాలో వారం రోజులపాటు సాగనున్న 'సింగరేణి పరిరక్షణ' బస్సు యాత్రను సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తమ్మినేని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కొన్ని బొగ్గు బ్లాకులు అమ్మేశారని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం పెట్టారని అన్నారు. స్వయంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇద్దరూ కూర్చొని వేలంపాట పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి మాత్రం గనులను ప్రయివేటీకరించడం లేదని చెబుతున్నారని, లోపల ఒకటి.. బయట ఒకటి మాట్లాడి కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తే బిఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. సింగరేణిని కాపాడటంలో కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే అసెంబ్లీలో తీర్మానం పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అన్ని పార్టీలతో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేద్దామని, ఎవరి రంగు ఏమిటో తేలిపోతుందని అన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని అదానీకి కట్టబెట్టేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంద నర్సింహారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి కుమార్తెకు లభించని ఊరట

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్ సముద్రతీరం వద్ద తన ప్రహరీని జివిఎంసి కూల్చేస్తోందంటూ వైసిపి రాజ్యసభ సభ్యుడు వి విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహా రెడ్డి వేసిన కేసులో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. ఈ కేసులో జనసేన కార్పొరేటర్ పి మూర్తి యాదవ్‌ను ప్రతివాదిగా చేర్చేందుకు అనుమతినిచ్చింది. ఈ కేసులో కౌంటర్ కూడా దాఖలు చేయాలని మూర్తిని ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బి కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈలోగా స్టేటస్‌కో ఆర్డర్ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరగా, అందుకు నిరాకరించారు. ప్రహరీ కూల్చివేతకు అధికారులు తుది ఆదేశాలిచ్చారని ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ సింగమనేని ప్రణతి చెప్పారు. విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

సెక్యూరిటీ రివ్యూ కమిటీ రిపోర్టుపై స్పందించండి : హైకోర్టు

భద్రతకు సంబంధించి సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్‌ఆర్‌సి) ఇచ్చిన నివేదికపై ఏం చేయాలో తెలియజేయాలని పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హైకోర్టు కోరింది. నివేదికను సవాలు చేసుకునే వెసులుబాటు ఉందని స్పష్టం చేసింది. విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ బివిఎల్‌ఎన్ చక్రవర్తి సోమవారం ప్రకటించారు. మంత్రిగా ఉండగా ఉన్న భద్రతను యథాతథంగా కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలంటూ పెద్దిరెడ్డి పిటిషన్ వేశారు. పెద్దిరెడ్డికి 2ప్లస్2 భద్రతను కొనసాగించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేగా ఉన్న పెద్దిరెడ్డికి 1ప్లస్1 భద్రత సరిపోతుందని, ఆయనకు ప్రాణహాని లేదని రివ్యూ కమిటీ రిపోర్టు ఇచ్చిందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

వివేకా హత్య కేసు సాక్షికి భద్రత

వైఎస్ వివేకా హత్య కేసు సాక్షిగా ఉన్న కొమ్మా శివచంద్రారెడ్డికి ఉండే 1ప్లస్1 భద్రతను తిరిగి ఏర్పాటు చేయాలని కడప జిల్లా ఎస్‌పిని హైకోర్టు ఆదేశించింది. సాక్షుల రక్షణ పథకం 2018 ప్రకారం తనకు భద్రత రద్దు చేయడం చెల్లదని చంద్రారెడ్డి చేసుకున్న దరఖాస్తుపై అధికారులు నిర్ణయం తీసుకునే వరకు ఆ భద్రతను కొనసాగించాలని జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య కేసులో సాక్షిగా ఉన్న తనకు సాక్షుల రక్షణ పథకం 2018 గతంలోని 1ప్లస్1 గన్‌మెన్ల భద్రతను రద్దు చేశారంటూ చంద్రారెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

ఉక్రెయిన్, గాజాల్లో హింసకు ముగింపు

క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల పిలుపు

టోక్యో : ఉక్రెయిన్, గాజా, మయన్మార్‌లలో హింసకు త్వరగా ముగింపు పలకాలని క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు పిలుపునిచ్చారు. జపాన్‌లోని టోక్యోలో సోమవారం క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో పాటు, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్, జపాన్ విదేశాంగ మంత్రి యోకో కమికావా, ఆస్ట్రేలియా విదేశాం మంత్రి పెన్నీ వాంగ్ పాల్గొన్నారు. హిందూ మహా సముద్రంలో కార్యకలాపాల విస్తరణపై, ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం క్వాడ్ నిబద్ధతను ఈ సమావేశం పునరుద్ఘాటించింది. ఈ సమావేశంలో ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో చెలరేగుతున్న భౌగోళిక, రాజకీయ పరిణామాలపై క్వాడ్ విదేశాంగ మంత్రులు చర్చించారు.

క్వాడ్ సహకారంతోనే ఇండో-పసిఫిక్‌లో సుస్థిరత, స్వేచ్ఛ : ఎస్ జైశంకర్

క్వాడ్ దేశాల సహకారంతోనే ఇండో-ఫసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛ, సుస్థిరత సాధ్యపడుతుందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ క్వాడ్ సహకారం మాత్రమే ఇండో-పసిఫిక్ స్వేచ్ఛగా, స్థిరంగా, సురక్షితంగా, సుసంపన్నంగా ఉండేలా చేస్తుందని అన్నారు. ప్రపంచానికి మేలు చేయాలనే నిబద్ధత ఈ ప్రాంతమంతా ప్రతిధ్వనించాలని అన్నారు. మన రాజకీయ అవగాహనాలు బలపడా లని, మన ఆర్థిక భాగస్వామ్యాలు వృద్ధి చెందాలని, మన సాంకేతిక సహకారాలు విస్తరించాలని, మన ప్రజల సౌకర్యాలు మెరుగుపడాలని జైశంకర్ తెలిపారు. సమావేశానికి ముందు జపాన్ ప్రధానమంత్రి పుమియో కిషిదాతో జైశంకర్ సమావేశమయ్యారు. క్వాడ్‌కు సంబంధించిన విషయాలతో పాటు, భారత్-జపాన్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు.



సమావేశానికి హాజరైన భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జపాన్, ఆస్ట్రేలియా, అమెరికా విదేశాంగ మంత్రులు యోకో కమికావా, పెన్నీ వాంగ్, ఆంటోని బ్లింకెన్,

15 రోజుల్లో పరిష్కారం

(మొదట పేజీ తరువాయి)

కలెక్టర్ ఆదేశాల మేరకు అక్కడికి ఆర్‌డిఒ కె.హేమలత వచ్చారు. నాయకులతోనూ, దళితులతోనూ మాట్లాడారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారిని జాయింట్ కలెక్టర్ సోభిక వద్దకు తీసుకెళ్లారు. జెసికి నాయకులు సమస్యను వివరించారు. దీనిపై జెసి స్పందిస్తూ, భూ సమస్యను 15 రోజుల్లో పరిష్కరిస్తామని, శివ్వాం గ్రామంలో ఇరువర్గాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన గడువులోగా సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని నాయకులు తేల్చి చెప్పారు. అరెస్టు చేసిన వారిని పోలీసులు విడుదల చేశారు.

రెవెన్యూ అధికారులు పెత్తందార్ల కొమ్ము కాస్తున్నారు : వి.వెంకటేశ్వర్లు

చర్చల అనంతరం వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దోషులను అరెస్టు చేయకుండా బాధితులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రెవెన్యూ అధికారులు పెత్తందార్ల కొమ్ము కాస్తుండడం దారుణమన్నారు.

దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వల్లే మళ్లీ ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. సర్వే నెంబర్ 102కి, సర్వే నెంబర్లు 20-30 మధ్య దూరాన్ని కలెక్టర్ స్వయంగా వచ్చి చూడాలని కోరారు.

జిరాయితీ భూమి సర్వే నెంబర్ 102కి తెచ్చిన ఇంజక్షన్ డి-పట్టా భూమికి ఎలా వర్తిస్తుందో ఆలోచించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘం పి.సంగం, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బొత్స నర్సింగరావు, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు, పి.వెంకటస్వామి, అధిక సంఖ్యలో బాధిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలపై పద్మవ్యూహం

(మొదట పేజీ తరువాయి)

అజిత్ దోవల్, బడా వ్యాపార వేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ అని చెప్పారు. కోవిడ్ సమయంలో పళ్లేలు కొట్టండని, దీపాలు వెలిగించండని, మొబైల్ ఫోన్ల టార్చ్‌లను వెలిగించండని మోడీ చెప్పినట్టల్లా చేసిన మధ్యతరగతి వారికి ఈ బడ్జెట్ ద్వారా వెన్నుపోటు పొడిచిందన్నారు. అంతేకాదు. వారి గుండెపై గుద్దిందని అన్నారు.భారత దేశాన్ని ఇరుకైన పెట్టెల్లో ఉంచాలని, వారు ఎలాంటి కలలు కనకుండా చేయాలని ఈ ప్రభుత్వం చూస్తోందని అన్నారు. బడ్జెట్‌లో పేదలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలనను పూర్తిగా నిర్లక్ష్యం చేసి బిజినెస్ వర్గాలకు అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు.

కేంద్రంలోని ప్రభుత్వం అదానీ, అంబానీల కోసమే ఉందంటూ రాహుల్ ఆగ్రహించారు. ఒక్క నిరుద్యోగికీ ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితి ఉందని విమర్శించారు. ఒకవైపు పేపర్ లీక్, మరోవైపు నిరుద్యోగ చక్రబంధంలో దేశం ఉందని, ఇంటర్న్‌షిప్ వల్ల యువతకు ఒరిగేదేమీ లేదని పేర్కొన్నారు. కాళ్లు విరగ్గొట్టి, మీద బ్లాంకెట్ వేసినట్లు ఉందంటూ తూర్పారపట్టారు. అగ్నివీర్‌ల పెన్షన్‌కు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, మధ్యతరగతిని పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర ఇవ్వాలని రైతులు చాలాకాలం నుంచి అడుగుతున్నారని, కాని బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదని నిప్పులు చెరిగారు. తాము కనీస మద్దతు ధర చట్టం చేస్తామని, దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని అన్నారు.

రాహుల్ ప్రసంగానికి అడ్డు తగిలిన బిజెపి ఎంపిలు

రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో బిజెపి ఎంపిలు పదే పదే అడ్డుతగిలారు. ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి రాహుల్ ప్రసంగం సాగకుండా బిజెపి ఎంపిలు అడ్డుతగిలేవారు. స్పీకరు ఓంబిర్లా కలగజేసుకుని ఒకరు ప్రసంగిస్తున్నప్పుడు ఇలా అడ్డుతగలడం సబబు కాదని అధికార పక్ష సభ్యులనుద్దేశించి అన్నారు

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ప్యాకేజీపై నమ్మకం లేదు

- అమరావతికి కేటాయించిన రూ.15 వేల కోట్లపై స్పష్టత ఏదీ?
- వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి
- లోక్‌సభలో వైసిపి నేత పివి మిథున్ రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని బిజెపి, కాంగ్రెస్ హామీ ఇచ్చాయని వైసిపి లోక్‌సభ పక్షనేత పివి మిధున్ రెడ్డి గుర్తు చేశారు. లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో మిథున్ రెడ్డి మాట్లాడారు. 'ఈ ప్యాకేజీపై మాకు నమ్మకం లేదు. ఇది అపోహ లాంటిది. ఇది ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న కొన్ని విషయాలను మాత్రమే తీసుకుంటుంది. ప్రజలు దీనిని అంగీకరించరు' అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం టిడిపితోపాటు అన్నీ కలిసి పనిచేయడానికి వైసిపి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రత్యేక హోదాను ప్యాకేజీతో భర్తీ చేయలేరని అన్నారు. రాజధాని అమరావతికి కేటాయించిన రూ.15 వేల కోట్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'ఇది అప్పు అయితే ఎవరు భరించాలి? రాష్ట్ర ప్రజలకు ఏం లాభం? అని ప్రశ్నించారు. ఈ రుణం ఎఫ్‌ఆర్‌బిఎం పరిధిలోనా? లేక ఎఫ్‌ఆర్‌బిఎంతో సంబంధ లేకుండా ఇప్పిస్తారా? అని ప్రశ్నించారు.

పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడమే పెద్ద తప్పు అని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే అదనపు వ్యయం ఎవరు భరిస్తారా? అని ప్రశ్నించారు. ఏ ప్రాజెక్టు అయినా కాపర్ డ్యాం పూర్తి చేసిన తరువాత, డయాఫ్రం వాల్ కడతారని, కానీ పోలవరం ప్రాజెక్టులో అలా జరగలేదని అన్నారు. కాపర్ డ్యాం పూర్తికాకుండానే డయాఫ్రం వాల్ కట్టారని, వరదలకు కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. దీనికి అయ్యే వేలాది కోట్లు ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. తాము మాత్రం రాష్ట్ర ప్రజలపై భారం పడితే ఒప్పుకోబోమని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఐరన్ ఓర్ కేటాయించకపోతే అన్యాయమే జరుగుతుందని చెప్పారు. కడప-బెంగళూరు రైల్వే లైన్ ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని కోరారు. పదేళ్లు అయిపోయిందని, విభజన చట్టంలోని అంశాలు మాత్రం అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే, పరిశ్రమలు, పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. తన నియోజకవర్గానికి వెళ్తే, తనపై దాడి చేశారని, వాహనాన్ని దగ్ధం చేశారని తెలిపారు. తనపైనే హత్యాయత్నం కేసు నమోదు చేశారని అన్నారు. శాంతి భద్రతలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కేంద్రం ఎక్కువ సాయం చేయాలి

- టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎక్కువ సాయం చేయాలని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో ఆయన బడ్జెట్‌పై జరిగిన చర్చలో మాట్లాడారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించాలంటే ఎక్కువ సహకారం అవసరం ఉందని, ప్రస్తుతం టిడిపి ఎన్‌డిఎలో భాగమే కాబట్టి వచ్చే ఐదేళ్లలో ఎక్కువ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విభజన చట్టాన్ని తయారుచేసిన కాంగ్రెస్.. ఎపికి చట్టంలో ఇచ్చిన హామీల గురించి మర్చిపోయి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. చట్టంలోని పేర్కొన్న ప్రకారమే అమరావతి, పోలవరానికి కేటాయింపులు చేశారని అన్నారు. వెనుకబడిన జిల్లాల నిధులు గురించి కూడా విభజన చట్టంలో ఉందన్నారు. రాష్ట్రంలో అనవసర ఖర్చులు చేసి జగన్ అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు.

ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలి : వల్లభనేని బాలశౌరి

ఆంధ్రప్రదేశ్‌లో విభజన చట్టం ప్రకారం ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలని జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి డిమాండ్ చేశారు. అలాగే కడప స్టీల్‌ప్లాంటును ఏర్పాటు చేయాలని, నిర్మాణంలో ఉన్న మచిలీపట్నం పోర్టుకు ఆర్థికంగా నిధులివ్వాలని కోరారు. లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కోరారు. మోడీ భవిష్యత్తు విజన్‌ను ఈ బడ్జెట్ స్పష్టం చేస్తోందని అన్నారు. గత పదేళ్లలో కార్మిక సంస్కరణలు, మేకిన్ ఇండియా, జిఎస్‌టి వంటి ఆర్థిక సంస్కరణలు, బేటీ బచావో బేటీ పడావో, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన, ఉజ్వల్ యోజన వంటి సామాజిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు.

వెనుకబడిన జిల్లాల నిధులు రూ.350 కోట్లు పెండింగ్

- కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ఇంకా రూ.350 కోట్లు వెనుకబడిన జిల్లాల నిధులు పెండింగ్ ఉందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జెడియు ఎంపి దినేష్ చంద్ర యాదవ్ అడిగిన వేర్వేరు ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం వెనుకబడిన ఏడు జిల్లాలకు రూ.2,100 కోట్లు సాయం అందించాలని నీతి ఆయోగ్ 2015 డిసెంబరు 1న సూచించిందని మంత్రి తెలిపారు. ఒక్కో జిల్లాకు రూ.300 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించిందని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఎపిలోని వెనుకబడిన జిల్లాలకు ఇప్పటి వరకు రూ.1,750 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. దీనిలో రూ.1,049.34 ఖర్చు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని అన్నారు. ప్రత్యేక సాయం కింద కొన్ని రాష్ట్రాలకు ఈ తరహా గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లను బడ్జెట్‌లో అందజేస్తామని అన్నారు. అంటే ఇంకా రూ.350 కోట్లే ఎపికి ఇవ్వాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలుకు వెనుబడిన జిల్లాల నిధులు ఇస్తున్నామని తెలిపారు.

వైజాగ్ మెట్రో సిఎంపిని అప్‌డేట్ చేయాలని అభ్యర్థన

వైజాగ్ మెట్రో సమగ్ర మొబిలిటీ ప్లాన్ (సిఎంపి)ని అప్‌డేట్ చేయమని రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థించిందని కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. 23 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన విశాఖపట్నం అతిపెద్ద నగరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలియజేసిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024 జనవరిలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) మోడల్‌లో 76.90 కిలో మీటర్ల నెట్‌వర్క్ పొడవుతో విశాఖపట్నం లైట్ మెట్రో రైలు ప్రాజెక్టును ప్రతిపాదించిందని తెలిపారు. ప్రాథమిక పరిశీలన తరువాత, ప్రాజెక్ట్ మదింపు కోసం ముందుగా అవసరమైన ప్రతిపాదనతో పాటు సమర్పించిన 2018 సమగ్ర మొబిలిటీ ప్లాన్ (సిఎంపి)ని అప్‌డేట్ చేయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యర్థించిందని అన్నారు.

మదురో హ్యాట్రిక్ విజయం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి అభ్యర్థి మదురోకు 51,50,000 ఓట్లు రాగా, మితవాదశక్తులతో కూడిన ప్రతిపక్ష యూనిటీ డెమొక్రటిక్ ప్లాట్‌ఫామ్ అభ్యర్థి గొంజాలెజ్‌కు 44,45,978 ఓట్లు లభించాయి. అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన మిగతా ఎనిమిది మంది అభ్యర్థులు పెద్దగా పోటీ ఇవ్వకుండానే నిష్క్రమించారు. ఈ ఎన్నికల్లో ఓటమిని అంగీకరిస్తున్నామని ప్రతిపక్ష అభ్యర్థులు రూసో, జోస్ బ్రిటో ప్రకటించారు. ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థి గొంజాలెజ్ మాత్రం ఫలితాలను అంగీకరించడం లేదన్నారు. పశ్చిమ దేశాలు, వాటి అధీనంలోని ప్రచార బాకాలు కూడా గొంజాలెజ్‌కు వత్తాసు పలికాయి. గొంజాలెజ్ మీడియాతో మాట్లాడుతూ, తనకు 70 శాతం, మదురోకు 30 శాతం ఓట్లు వచ్చాయని చెప్పుకున్నారు.

ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే అధ్యక్ష భవనమైన మిరా ఫ్లోర్స్ ప్యాలెస్ వద్ద ప్రజలు పెద్దయెత్తున గుమికూడి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మదురో డెబ్బయ్యో జన్మదినం కూడా ఇదే రోజు కావడంతో వారు మిఠాయిలు పంచుకుంటూ కేరింతలు కొట్టారు. బొలివేరియన్ విప్లవం వర్ధిల్లాలంటూ నినదించారు. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల నేతలు మదురోను అభినందించాయి. ఇది వెనిజులా ప్రజల విజయమని క్యూబా అధ్యక్షుడు డియాజ్ కానెల్ అభివర్ణించారు. బొలీవియా, హోండూరస్ తదితర దేశాల నేతలు ఇదొక చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు.

మూడవ సారి అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మదురో మాట్లాడుతూ, దేశంలో శాంతి, సుస్థిరత, దేశ సార్వభౌమత్వ పరిరక్షణను వెనిజులా ప్రజలు కోరుకుంటున్నారనడానికి ఈ విజయం ఒక తార్కాణమని అన్నారు.

చిన్నారి

మీకోసం

కూరలు వండేటప్పుడు నూనె వేడెక్కగానే కాస్త పసుపు వేస్తే, వాటి సహజరంగు కోల్పోకుండా ఉంటాయి.

జీవన సౌరభం

కాలాన్ని ఎలా గడపాలో కాదు. ఎలా ఉపయోగించుకోవాలో తెలిసినవారు అన్ని పనుల్లో ప్రావీణ్యత సాధిస్తారు.

JEEVANA జీవన the family

వచ్చింది-వచ్చింది

చిలుక వచ్చింది
తాత పిలక అంటూ
సరదా పలుకులు పలికింది..

పిల్లి వచ్చింది
మ్యావ్ మ్యావ్ అని అరవకుండా
ఎలుకను పట్టింది..

కుక్క వచ్చింది
భౌ భౌ మంటూ కొత్తవారిని
బయట అడ్డుకుంది..

ఆవు వచ్చింది
అంబా అంబా అంటూ
పిల్లకు పాలు ఇచ్చింది..

కాకి వచ్చింది
కావ్ కావ్ మని అరుచుచు
చుట్టం రాకను తెలిపింది..

ఉడత వచ్చింది
వాకిట్లోని నేరెడు పిక్కలు
కొరికి వెళ్లింది..

సీతాకోక చిలుక వచ్చింది
పువ్వులపైన వాలింది
తేనెలు జుర్రుకు వెళ్లింది..

- ఎన్.వి.ఆర్ సత్యనారాయణమూర్తి,
80752 6849.

నీడ కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జంతువుల బొమ్మలు ఉన్నాయి. ఎదురుగా వాటి నీడలు ఉన్నాయి. దేని నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.



నేను గీసిన బొమ్మ

మధుప్రియ,
9వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్ నిజాంపేట్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అడ్డాల్లో బతుకు పోరాటం

వారంతా రోజువారీ కూలీలు... పూర్తిగా తెల్లవారక ముందే ఇంటి నుంచి బయలు దేరతారు. కూలి పనికోసం అడ్డాలకు వెళ్తారు. తీరా వస్తే ఎవరికి పని దొరుకుతుందో ఎవరికి దొరకదో తెలియని పరిస్థితి! వారానికి మూడు రోజులు కూలి దొరకడమే గగనం. మరోపక్క ఇచ్చే కూలి చెల్లింపుల్లోనూ బేరసారాలు.. ఆ రోజు అడ్డాల్లో కూలీలు ఎక్కువున్నారంటే కూలీ రేట్లు తగ్గిపోతాయి. ఇప్పుడు అడ్డా కూలీల పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లోని అడ్డాల్లోనూ ఇదే ఈ పరస్థితి ఉంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా విజయవాడ, విశాఖ, తిరుపతి తదితర చోట్ల దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. విజయవాడలో 100 అడ్డాల్లో రోజువారీ సుమారు లక్ష మంది కూలీలు పనుల కోసం పడిగాపులు పడుతూ కనిపిస్తారు. ఉదయం 6.30 గంటలకు అడ్డాలన్నీ కూలీలతో కిటకిటలాడిపోతూ దర్శనమిస్తాయి. అడ్డాకు కూలికి వచ్చిన వారికి ఒక్కోరోజు 12.30 గంటలు దాటినా కూలికి పిలిచేవారు లేక వెనుదిరగాల్సి వస్తోంది.

విజయవాడలోని బెంజిసర్కిల్, పటమట, వన్‌టౌన్, విద్యాధరపురం, భవానీపురం, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది కూలీలు పనులిచ్చే వారి కోసం ఎదురుచూస్తుంటారు. పురుషులు, మహిళలు కూడా ఉన్నారు. భవన నిర్మాణరంగంలో పనులతోపాటు ఇళ్లల్లో చిన్నపాటి పనులు, డ్రెయినేజీల క్లీనింగ్, రోడ్డు పనులు, శుభ, అశుభ కార్యాలకు సంబంధించిన పనులు, హోటళ్లలో క్లీనింగ్ నిమిత్తం వినియోగించుకునేందుకు సైతం కొందరిని ఎంపిక చేసుకుంటారు. పనులిచ్చేవారు తమకు అవసరమైనంత మందిని ఎంపిక చేసుకుని ఇంత కూలీ ఇస్తామని చెప్పి తీసుకెళ్తారు. పనయ్యాక డబ్బులిచ్చి పంపించేస్తుంటారు. ఏడాదిలో 365 రోజులూ ఇదేలాగున వారి జీవిత ప్రయాణం జరుగుతుంటుంది. ఇటీవల కాలంలో పనుల్లేక వెనుదిరిగిన రోజులు ఎక్కువవుతున్నాయని దినసరి కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. బెంజిసర్కిల్ వద్ద మధ్యాహ్నం వరకూ దుకాణాల దగ్గర, రోడ్డుపక్కన, లేదా ఫ్లైఓవర్ కింద ఆశ్రయం పొందుతుంటారు. కొందరు ఓపిగ్గా గంటల తరబడి తమ కాళ్లపైనే నిలబడి ఉంటుంటారు. విజయవాడ బెంజిసర్కిల్ వద్ద కార్మికులతో మాట్లాడి, వారి స్థితిగతుల గురించి మాట్లాడింది 'జీవన'.

ఇక్కడ పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారం

అడ్డాలను ఆశ్రయించే కార్మికులు రోజువారీ కుటుంబ అవసరాల ఖర్చులకు అప్పులు తీసుకోవాల్సి వస్తోంది. అడ్డాలను ఆధారంగా చేసుకుని పలువురు వడ్డీ వ్యాపారులు దందాలు చేస్తున్నారు. మేస్త్రీల గ్యారెంటీతో కూలీల అవసరానికి అధిక వడ్డీలకు అప్పులిస్తున్నారు. సాధారణంగా నూటికి నెలకు సగటున రూ. 2 వరకు వడ్డీ మార్కెట్‌లో వసూలు చేస్తుండగా అడ్డా కూలిల అవసరాలను ఆసరా చేసుకుని నూటికి నెలకు రూ. 5 నుంచి రూ. 10 వసూలు చేస్తున్నారు. దీంతో పని దొరికిన రోజు వచ్చే కూలీల్లో ఎక్కువ మొత్తం వడ్డీ వ్యాపారులకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు
ఫొటోలు : టివి రమణ

వలస వచ్చాం...

మాలాగా ఇతర ప్రాంతాల నుంచి విజయవాడకు వలస వచ్చిన కార్మికులు లక్షల్లో ఉంటారు. ఇసుక పూర్తిగా అందుబాటులోకి రాకపోవటం వల్ల పనులు ఆగిపోతున్నాయి. ఆషాఢమాసం కావటం వల్ల కొత్త పనులు ప్రారంభం కావటం లేదు. అడ్డాల్లో పనుల్లేక వందలాది మంది మళ్లీ నిరాశతో ఇంటికి వెళ్లాల్సివస్తోంది.

- వీరంకి రాంబాబు, తెనాలి, గుంటూరు జిల్లా

ప్రతిరోజూ ఆశతో వస్తాం

గంటల తరబడి పనుల కోసం ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు వేచి వుండేందుకు ప్రత్యేకంగా షెల్టర్లు ఏర్పాటు చేయాలి. కాలకృత్యాలు తీర్చుకోవటానికి ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఇసుక ఎగుమతి, దిగుమతి కార్మికులతోపాటుగా డ్రెయినేజీల క్లీనింగ్ చేసే వారికి ఒక మాదిరిగా పనులు దొరుకుతున్నాయి. అన్‌స్కిల్డ్ వర్కర్లకే కొద్దిగా ఉంటున్నాయి. స్కిల్డ్ వర్కర్లకు పనుల్లేవు.

- బసవా దుర్గారావు, పొందూరు, శ్రీకాకుళం జిల్లా

పనుల్లేక అవస్థలు

భవన నిర్మాణరంగంలో ఇసుక సమస్య ఇంకా తీరలేదు. ఈ రంగంలో 10 నుంచి 12 రకాల పనులు చేసే కార్మికులు పనులు దొరక్క, కారణంగా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎర్త్‌వర్కర్లు, ఆగర్లు, రాడ్‌బెండర్లు, సెంట్రింగ్, కాంక్రీట్ వర్కర్లు పనుల్లేక రోజువారీ కూలీలుగా మారిపోతున్నారు. తాపీ మేస్త్రీలు, వెల్డింటర్లు, మార్బుల్ వర్కర్లు కూడా పనుల్లేవు. కొన్ని దశాబ్దాలుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. పనులున్న రోజు ఫర్వాలేదు. పనుల్లేని రోజుల్లో పస్తులుంటే పరిస్థితులు నెలకొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు పనులు కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- మాజేటి నాగమల్లేశ్వరరావు, మచిలీపట్నం, కృష్ణాజిల్లా.

పనుల్లేక పస్తులు

మాది శ్రీకాకుళం జిల్లా. 14 ఏళ్ల క్రితం పనుల నిమిత్తం విజయవాడ వచ్చాం. అప్పటి నుంచి భవన నిర్మాణరంగం, ఇతర కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాం. మాలాంటి చాలామంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అక్కడ పనుల్లేక విజయవాడ నగరానికి వస్తున్నారు. వారంలో మూడు నుంచి నాలుగు రోజులు మించి పనులు దొరకటం లేదు. దొరికిన రోజున వచ్చిన డబ్బులతోనే కుటుంబాలను పోషించుకుంటున్నాం. పనుల్లేని రోజుల్లో మా లాంటి వారు పస్తులుండే పరిస్థితులు నెలకొన్నాయి.

- కె.రామకృష్ణ, చీపురుపల్లి, శ్రీకాకుళం జిల్లా.

232 పనిదినాలు

- అక్టోబర్ 4 నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు 232 పనిదినాలు జరగనున్నాయి. జూన్ నుంచి ఏప్రిల్ వరకు 315 రోజులు ఉండగా, ఇందులో 83 రోజులు సెలవు దినాలుగా ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు (1 నుంచి 5వ తరగతులు) ఉదయం 9 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు తరగతులు జరగనున్నాయి. ఉన్నత పాఠశాలల (6 నుంచి 10వ తరగతులు)కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ప్రాథమిక పాఠశాల తరగతులు మొదటి పీరియడ్ 40 నిమిషాలు చొప్పున, మిగిలిన పీరియడ్లు 35 నిమిషాల చొప్పున బోధన జరుగుతుంది. ఉన్నత పాఠశాల తరగతులకు మొదటి పీరియడ్ 45 నిమిషాల చొప్పున మిగిలిన పీరియడ్లు 40 నిమిషాల చొప్పున జరుగుతాయి. ఒంటి పూట బడులు ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయి. దసరా సెలవులు అక్టోబరు 10 నుంచి 13వ తేదీ వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు ఉంటాయి. క్రిస్టియన్ విద్యాసంస్థలకు క్రిస్మస్ సెలవులు డిసెంబరు 22 నుంచి 29 వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 11 నుంచి 15వ తేదీ వరకు ఉంటాయి.

పరీక్షల షెడ్యూల్

పేరు	తేదీలు	సిలబస్
ఫార్మెటివ్ అసెస్‌మెంట్ -1	ఆగస్టు 27 నుంచి 31వరకు	జూన్, జులై
సిబిఎ-1(1 నుంచి 8వ తరగతి)		
ఫార్మెటివ్ అసెస్‌మెంట్-2	అక్టోబర్ 21 నుంచి 25	ఆగస్టు, సెప్టెంబర్
సమ్మెటివ్ అసెస్‌మెంట్-1	నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4	జూన్ నుంచి అక్టోబర్
ఫార్మెటివ్ అసెస్‌మెంట్ -3	జనవరి 27 నుంచి 31వరకు	నవంబర్, డిసెంబర్
సిబిఎ-2(1 నుంచి 8వ తరగతి)		
ప్రీ ఫైనల్(10వ తరగతి)	ఫిబ్రవరి 10 నుంచి 20	పూర్తి సిలబస్
ఫార్మెటివ్ అసెస్‌మెంట్ -4 (1 నుంచి 9వ తరగతి)	మార్చి 3 నుంచి 7వరకు	జనవరి, ఫిబ్రవరి
సమ్మెటివ్ అసెస్‌మెంట్-2	ఏప్రిల్ 7 నుంచి 17 వరకు	పూర్తి సిలబస్
సిబిఎ-3 (1 నుంచి 8వ తరగతి)		

పాఠశాల అకడమిక్ క్యాలెండర్ విడుదల

- రాజకీయాలకు అతీతంగా రూపకల్పన
- విద్యాశాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్య అకడమిక్ (2024-25) క్యాలెండర్‌ను విద్యాశాఖ, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యాశాఖ అధికారులతో కలిసి సోమవారం విడుదల చేశారు. గతానికి భిన్నంగా రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి, మంత్రి ఫొటోలు లేకుండా క్యాలెండర్‌ను అధికారులు రూపొందించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాలయాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఎటువంటి రాజకీయ జోక్యాన్ని అనుమతించబోమని చెప్పారు. టీచర్లు, విద్యార్థులకు ఇచ్చే శిక్షణ దీపికల్లో సైతం మంత్రి సందేశం, ఫొటోలు, పార్టీ రంగులు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలను ఆగస్టులో పూర్తిచేయాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాల మెరుగుదల పర్యవేక్షణ బాధ్యతను తల్లిదండ్రుల కమిటీలకు అప్పగించాలని సూచించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపరచాలని, ఇందుకు అవసరమైన కెమికల్స్, ఉపకరణాల కొనుగోలుకు తక్షణమే టెండర్లు పిలవాలని ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ఖరారు చేయాలని సూచించారు. సిబిఎస్ఇ స్కూళ్ల పనితీరుపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టరు విజయరామరాజు, సమగ్రశిక్షా డైరెక్టరు బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమర్షియల్ ట్యాక్స్‌లో స్కాం కేసు సిఐడికి బదిలీ

- తెర వెనక సూత్రధారి మాజీ సిఎస్ సోమేశ్ కుమార్
- అధికారుల దర్యాప్తులో వెల్లడి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కమర్షియల్ ట్యాక్స్(వాణిజ్య పన్నులు)కు సంబంధించి వెలుగులోకి వచ్చిన భారీ ఇన్‌పుట్ సబ్సిడీ స్కాంపై దర్యాప్తు జరపాలని రాష్ట్ర సిఐడికి ప్రభుత్వం సోమవారం రాత్రి కేసు బదిలీ చేసింది. ఈ స్కాంపై రెండువారాల క్రితం కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర నేర పరిశోధక విభాగం (సిసిఎస్) అధికారులు కేసును నమోదు చేసి విచారణను ప్రారంభించారు. దాదాపు రూ.1400 కోట్ల మేరకు ఈ స్కాం చోటు చేసుకున్నదని దర్యాప్తు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, బేవరేజేస్ కార్పొరేషన్‌కు సంబంధించి రూ.1000 కోట్లు, వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి రూ.400 కోట్ల మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ స్కాం చోటు చేసుకున్నట్టు ఇంతవరకు దర్యాప్తు అధికారులు ప్రాథమికంగా తేల్చారు. ఈ ఇన్‌పుట్ సబ్సిడీని అక్రమంగా రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన దాదాపు 75 కంపెనీలకు మంజూరు చేసినట్టు అధికారుల దృష్టికి వచ్చింది. ఈ విధంగా కేటాయింపులు జరపటంలో కమర్షియల్ ట్యాక్స్‌కు చెందిన కొందరు మాజీ అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కీలక పాత్ర వహించినట్టు అధికారుల దర్యాప్తులో వెల్లడైనట్టు తెలుస్తున్నది. కమర్షియల్ ట్యాక్స్‌కు చెందిన అదనపు కమిషనర్, ఐటి కంపెనీకి చెందిన శోభన్‌బాబు అనే నిపుణుడితో పాటు మాజీ సీఎస్ సోమేశ్వర్‌రావులను కలిపి దాదాపు ఆరుగురిపై సిసిఎస్ పోలీసులు కేసులను నమోదు చేసినట్టు సమాచారం. ఇన్‌పుట్ సబ్సిడీలు పొందిన కంపెనీలు తెలంగాణతో పాటు ఆంధ్ర, తమిళనాడు, బీహార్, హర్యానా, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ఉన్నట్టుగా గుర్తించారు. సిఐడిలోని ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ (ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగం)కు అప్పగించినట్టు సమాచారం.

మరో కాంస్యంపై భారత్ గురి

- 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీం విభాగంలో నేడు కొరియాతో ఢీ
- అర్జున్‌కు తృటిలో చేజారిన పతకం

పారిస్: ఒలింపిక్స్‌లో భారత్ మరో కాంస్య పతకంపై గురిపెట్టింది. మూడోరోజు భారత్‌కు ఒక్క పతకం దక్కకున్నా... మంగళవారం జరిగే 10మీ. ఎయిర్ పిస్టల్ టీం విభాగంలో మనిక బత్రా-షరబ్‌జ్యోతి సింగ్ జోడీ కాంస్య పతకానికి కొరియాతో తలపడనుంది. సోమవారం జరిగిన 10మీ. ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో ఫైనల్‌కు చేరి ఆశలు రేపిన అర్జున్ బబుతా ప్రారంభంలో అద్భుత ప్రదర్శనతో 3వ స్థానంలో నిలిచినా.. ఆ తర్వాత క్రమంలో పట్టు కోల్పోయి పతకానికి మెట్టు దూరంలో నిష్క్రమించాల్సి వచ్చింది. బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్ గ్రూప్‌లో రెండో విజయాన్ని సొంతం చేసుకోగా.. పురుషుల హాకీ జట్టు అర్జెంటీనాతో మ్యాచ్‌ను డ్రాగా ముగించి ఊపిరి పీల్చుకుంది. మంగళవారం జరిగిన కాంస్య పతక పోటీలో మనిక-షరబ్‌జ్యోత్ సింగ్‌లతో కూడిన భారత మిక్స్‌డ్ జట్టు కొరియాతో తలపడనుంది.

లక్ష్యసేన్‌కు రెండో విజయం

భారత షట్లర్ లక్ష్యసేన్ పారిస్ ఒలింపిక్స్ గ్రూప్ స్టేజ్‌లో రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించాడు. జులియన్ కర్రాగ్గిపై అతను వరుస సెట్లలో గెలుపొందాడు. 52 వరల్డ్ ర్యాంక్ ప్లేయర్ జులియన్‌పై 21-19, 21-14 స్కోరుతో లక్ష్యసేన్ విజయం సాధించాడు. తొలి సెట్‌లో సేన్ తీవ్రంగా కష్టపడ్డాడు. ఓ దశలో ప్రత్యర్థి ముందంజలో ఉన్నాడు. కానీ పుంజుకున్న లక్ష్యసేన్.. ఆ సెట్‌ను స్వల్ప తేడాతో కైవసం చేసుకున్నాడు. ఇక రెండవ సెట్‌లో దూకుడుమీదున్న సేన్.. సునాయాసంగా ఆ సెట్‌ను చేజిక్కించుకున్నాడు. మూడో లీగ్‌లో లక్ష్యసేన్ స్టార్ ప్లేయర్ జోనాథన్ క్రిస్టీతో తలపడనున్నాడు.

హాకీలో అర్జెంటీనాతో డ్రా..

పురుషుల హాకీ జట్టు అర్జెంటీనాతో సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో డ్రాగా ముగించింది. చివరి నిమిషంలో ఇండియా ఒక గోల్ కొట్టడంతో 1-1తో మ్యాచ్ డ్రా అయ్యింది. పూల్-బి హాకీ మ్యాచ్‌లో.. ఆఖరిలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఇండియాకు ఆశను నింపారు. మరో రెండు నిమిషాల్లో ఆట ముగుస్తుందన్న సమయంలో ఆ అద్భుతం చోటుచేసుకున్నది. ఇండియాకు వరుసగా పెనాల్టీ కార్నర్లు వస్తున్నా.. వాటిని గోల్స్‌గా మలచ లేకపోయింది. ఇక ఆట 5 నిమిషాల్లో ముగుస్తుం దన్న సమయంలో.. ఇండియా గోల్‌కీపర్ శ్రీజేశ్ కూడా రంగంలోకి దిగాడు. ఇండియా తన తదుపరి మ్యాచుల్లో బలమైన ఆస్ట్రేలియా, బెల్జియం జట్లను ఎదుర్కోవాల్సి ఉంది.

పారిస్ ఒలింపిక్స్‌లో నేడు (భారత్ పాల్గొనే క్రీడాంశాలివే..)

మ.12.00గం॥ బ్యాడ్మింటన్(గ్రూప్‌స్టేజ్) హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, పివి సింధు, డబుల్స్: సాత్విక్-చిరాగ్ శెట్టి, తానీషా, పొన్నప్ప
మ.12.30గం॥ షూటింగ్(ట్రాప్): పృథ్వీరాజ్-తొండైమాన్, రాజేశ్వరి-శ్రేయసి
మ.1.00గం॥ షూటింగ్(10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్: భారత్-ద.కొరియా కాంస్య పతక పోటీ (మను బాకర్-షరబ్‌జీత్ సింగ్)
మ.1.30గం॥ టేబుల్‌టెన్నిస్ రౌండ్-32: శరత్ హర్మీత్, మనిక, శ్రీజ
మ.2.30 గం॥ ఈక్వెస్ట్రియన్: డ్రెస్సేజ్: అనూష్ అగర్వాల్లా
మ.3.30 గం॥ ఆర్చరీ రౌండ్-64: బి. ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్ దీపికా కుమారి అంకితా భకత్, భజన్ కౌర్
సా.4.38 గం॥ మహిళల బాక్సింగ్ 57కి. రౌండ్-32: జాస్మినే లంబోరియా
సా.4.45 గం॥ హాకీ: భారత్ × ఐర్లాండ్

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
1. ద.కొరియా	5	3	1	9
2. జపాన్	5	2	4	11
3. చైనా	5	2	2	9
4. ఫ్రాన్స్	4	7	3	14
5. ఆస్ట్రేలియా	4	3	0	7
6. అమెరికా	3	7	4	14
7. బ్రిటన్	2	4	3	9
8. జర్మనీ	2	0	0	2
9. ఇటలీ	1	2	3	6
10. కెనడా	1	1	2	4
25. ఇండియా	0	0	1	1

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

2025 ఆసియాకప్‌కు భారత్ ఆతిథ్యం

ముంబయి: 2025 పురుషుల ఆసియా కప్‌కు భారత్‌కు ఆతిథ్యమివ్వనుంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిఎ) జారీ చేసిన స్పాన్సర్‌షిప్ హక్కుల కోసం నిర్వహించిన బిడ్డింగ్‌లో భారత్ ఆతిథ్య హక్కులను దక్కించుకుంది. మొత్తం 13మ్యాచులు జరగనుండగా.. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌తో పాటు మరో జట్టును క్వాలిఫైయింగ్ టోర్నమెంట్‌ద్వారా ఎంపిక చేస్తారు. షెడ్యూల్ తేదీలు ఇంకా ఖరారు కానప్పటికీ సెప్టెంబర్‌లో నిర్వహించనున్నట్లు సమాచారం. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నమెంట్ టి20 ఫార్మాట్‌లో జరగనుంది. ఇక 2023లో ఆసియా కప్‌ను హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన విషయం తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా.. పాక్‌కు ఆతిథ్య హక్కులు లభించగా.. టీమిండియా మ్యాచులన్నీ శ్రీలంక వేదికగా జరిగాయి. రోహిత్ శర్మ కెప్టెన్సీలో, కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో శ్రీలంకను 10 వికెట్ల తేడాతో ఓడించిన భారత్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇక 2027లో బంగ్లాదేశ్‌లో నిర్వహించనున్న ఆసియా కప్ 50 ఓవర్ల ఫార్మాట్ జరగనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రాం 2023-27 ప్రకారం.. భారతదేశం వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి-మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీలో, ఆ తర్వాత ఐపిఎల్ టోర్నమెంట్‌లు జరగనున్నాయి. ఆ తర్వాత భారత్ వన్డేలు, టి20 సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్‌కు వెళ్లనుంది. ఆ తర్వాత భారత్ జూన్ నుంచి ఆగస్టు వరకు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది.

లక్ష్యం క్లీన్‌స్వీప్

- నేడు శ్రీలంకతో మూడు టి20
- రాత్రి 7.00గం॥లకు

పల్లెకెలె: మూడు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లను గెలిచి సిరీస్‌ను చేజిక్కించుకున్న భారత్.. ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. బ్యాటింగ్‌లో టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత ఫామ్‌లో ఉండగా.. శుభ్‌మన్ గిల్ నిరాశపరిచాడు. దీంతో రెండో టి20కి ఓపెనర్‌గా వచ్చిన సంజు(0) కూడా డకౌట్ కావడంతో జైస్వాల్‌తో ఓపెనర్‌గా వచ్చే మరో ఆటగాడికోసం ఎవరు? అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. రెండో టి20 డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. తొలి టి20లో ఏకంగా 43పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరోవైపు శ్రీలంకకు మిడిలార్డర్ సమస్య వేధిస్తోంది.

జట్టు(అంచనా)...

భారత్: జైస్వాల్, గిల్/సంజు, సూర్యకుమార్(కెప్టెన్), పంత్(వికెట్ కీపర్), హార్దిక్, రింకు, రియాన్, సుందర్, బిష్ణోయ్, సిరాజ్, ఖలీల్.

శ్రీలంక: అసలంక(కెప్టెన్), కుశాల్ మెండీస్(కీపర్), నిస్సంక, పెరీరా, ఆవిష్కా ఫెర్నాండో, ఛండీమాల్, హసరంగ, తీక్షణ, మధుశంక, పథీరన, ఫెర్నాండో.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68